ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 17.0

వారిపై మరింత నిఘా

» నూతన విజిలెన్స్ ఎస్పీ నాగేశ్వరరావు



ఏలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆదాయాలకు గండికొట్టే చర్యలు, యంత్రాంగాలపై నిరంతరం నిఘా ఉంచి పారదర్శకంగా సేవలందించేందుకు కృషి చేస్తానని జిల్లా విజిలెన్స్ ఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. ఒంగోలు జిల్లా ఏఎస్పీగా పనిచేస్తున్న ఆయన బదిలీ వచ్చి ఇటీవల ఉమ్మడి జిల్లా రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ సంస్థలపై నిఘాను కట్టుదిట్టం చేస్తామన్నారు. చాలాకాలంగా విజిలెన్స్ ఎస్పీ పోస్టు ఖాళీగా ఉండగా విజయవాడ విజిలెన్స్ ఎస్పీ మహేశ్ ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ వచ్చారు.



దళారులను నమ్మొద్దు

» జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

చాట్రాయి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):రైతులు ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మి మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాధికారి హబీబ్ బాషా సూచించారు. చాట్రాయిలో శుక్రవారం వరికోతలు, ధాన్యం కొనుగోళ్లు, గోనె సంచులు, గొడౌన్, ధాన్యంలో తేమ శాతం పరీక్షించే విధానం మొదలైన అంశాలను పరిశీలించారు. రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఎంటీయూ-1224, ఎంటీయూ-1262 రకాలు ఎక్కువ సాగు చేశారని ఇవి గ్రేడ్-1 రకం అని, మండలంలో ఇప్పటి వరకు 800 మెట్రిక్ టన్నులు రైతుసేవా కేంద్రాల ద్వారా సేకరించినట్టు చెప్పారు. ఆయన వెంట నూజివీడు ఏడీఏ వై.సుబ్బారావు, ఏవో శివశంకర్, సిబ్బంది ఉన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

» డీపీటీవో షేక్ షబ్నం

ఏలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):జిల్లా ప్రజా రవాణా వ్యవస్థ(పీటీడీ) ద్వారా జిల్లావ్యాప్తంగా భక్తుల సౌకర్యార్థం చివరి కార్తీక సోమవారం పంచారామ క్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్టు డీపీటీవో షేక్ షబ్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి సెమీ లగ్జరీ, సూపర్ లగ్జరీ బస్సులను ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ఏర్పాటు చేశామన్నారు. ఇవి రాత్రి 8 గంటలకు బయల్దేరి తిరిగి సోమవారం రాత్రి చేరుకుంటాయన్నారు. సూపర్ లగ్జరీ చార్జీ రూ.1200, సెమీ లగ్జరీ చార్జి రూ.1100 లుగా నిర్ణయించామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. శబరిమల యాత్రకు ప్రత్యేకంగా టూర్ ప్యాకేజీలు ఏర్పాటు చేశామని, ఏడు రోజులకు రూ.6,100 టిక్కెట్ ధర నిర్ణయించినట్టు తెలిపారు. వివరాలకు 93467 67670లో సంప్రదించాలన్నారు.

షుగర్ నియంత్రణకు మార్గాలు

» డీఎంహెచ్‌వో అమృతం



ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేగంగా విస్తరిస్తున్న మధుమేహాన్ని(డయాబెటిస్) ప్రజల్లో అవగాహన కలిగించడం, చక్కని జీవనశైలితోనే నియంత్రించగలమని డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం పేర్కొన్నారు. ప్రపంచ మధుమేహ నివారణ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ విభాగం ఆధ్వర్యంలో పవర్‌పేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డయాబెటిస్ నివారణ, నియంత్రణలపై సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ఎన్సీడీ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, ఏవో డాక్టర్ గంగాభవాని, మోనటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పూజ, డాక్టర్ ట్వింకిల్, వైద్యాధికారి డాక్టర్ గౌతమ్‌రాజు, డాక్టర్ భార్గవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కమ్మేస్తున్న దుమ్ము..!

నత్తనడకన 365 బీబీ జాతీయ రహదారి పనులు
స్థానికులు ఆవేదన

జీలుగుమిల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 365 బీబీ జాతీయ రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అందుకు తగ్గట్టుగా పనులు ముందుకు సాగడం లేదు. ఇందుకు తాటియాకులగూడెం వద్ద రోడ్డు దుస్థితే నిదర్శనం. తెలంగాణ సరిహద్దు తాటియాకులగూడెం నుంచి వయా జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మీదుగా కొత్త పట్టిసీమ వరకు ఈ రహదారిని నిర్మిస్తున్నారు. పనులు ప్రారంభించి ఏడాది కావొస్తోంది. కనీసం రోడ్డుపై గోతులు సరిచేయడం లేదు. వాహనాల రాకపోకల సమయంలో లేస్తున్న దుమ్ము సమీప ఇళ్లల్లోకి చేరడంతో తమ ఆరోగ్యం దెబ్బతింటోందని స్థానికులు వాపోతున్నారు. దుమ్ము కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఎన్‌హెచ్ ఏఈ కాజాను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



సాగునీటికి.. మహర్దశ

రూ.9.11 కోట్లతో ప్రక్షాళన షురూ

» ఓఅండ్ఎంతో తూడు,గుర్రపుడెక్క తొలగింపు పనులు
» మార్చి నెలాఖరు నాటికి పూర్తి : ఎస్ఈ దేవప్రకాశ్

జిల్లా జలవనరులశాఖ సర్కిల్ పరిధిలో కాల్వలు, డ్రెయిన్ల బాగుచేతకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. ఇప్పటికే కొన్ని పనులు పురోగతిలో ఉండగా, వేసవి ప్రారంభం అయ్యే నాటికి అన్ని పనులు పూర్తి చేయను న్నారు. సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు అధిగమించే దిశగా ప్రక్షాళనకు అధికారులు శ్రీకారం చుట్టారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వం రూ.9.11 కోట్ల మంజూరు చేయడంతో అన్నదాతకు ఇక్కట్లు తీరనున్నాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గోదావరి, కృష్ణా కాల్వల కింద సాగు, తాగునీటికి ప్రవాహానికి అవరోధాలుగా ఉన్న తూడు, గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపునకు జలవనరులశాఖ ఈ ఏడాది ముందస్తు ఏర్పాట్లతో కసరత్తులను మొదలెట్టింది. వైసీపీ ప్రభుత్వం హయాంలో కాల్వలు,డ్రెయిన్ల ప్రక్షాళన పనుల ఊసెత్తకుండా సాగునీటి రంగాన్ని నిర్వీర్యం చేశారు. తాజాగా 2025-26 సంవత్సరానికి జిల్లాలో ఓఅండ్ఎం పనులు చేయడానికి రూ.9.11 కోట్ల వ్యయంతో 201 పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు.

పనులిలా..

జిల్లాలో గ్రౌండ్‌వాటర్ డివిజన్ పరిధిలో రూ.1.71 కోట్లతో 62 పనులు, డ్రెయినేజీ డివిజన్ పరిధిలో రూ.2 కోట్ల 43 లక్షల 14 వేలతో 65 పనులు, ఏలూరు ఇరిగేషన్ డివిజన్ పరిధిలో రూ.4 కోట్ల 71 లక్షల 45వేలతో 71 పనులు,స్పెషల్ మైనర్ ఇరిగేషన్ డివిజన్ పరిధిలో రూ.25 లక్షలతో మూడు పనులు చేపట్టనున్నారు.

డిసెంబరు నాటికి డ్రెయిన్లు

డిసెంబరు నెలాఖరు నాటికి మేజర్, మైనర్ డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టుతీత, గుర్రపుడెక్క, తూడు, కిక్కిసలను తొలగించాలని నిర్ణయించారు. స్థానికంగా ఉన్న నీటి సంఘాల ఆధ్వర్యంలో ఈ పనులు నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం చేయాలని అధికారులు ఏఈలకు ఆదేశాలను జారీ చేశారు.

మార్చి నాటికి కాల్వల్లో పూడికలు తొలగింపు

- గోదావరి, కృష్ణా కాల్వలు వెంబడి జంగిల్ క్లియరెన్స్ జనవరిలో చేపట్టనున్నారు. ఆపై కాల్వలు ఇరువైపులా పేరుకుపోయిన మట్టిదిబ్బలను తొలగిస్తారు. అనంతరం గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను తొలగించడానికి రంగం సిద్ధం చేయనున్నారు.
- రెండు పంటల సీజన్లకు సంబంధించి కాల్వల ప్రక్షాళన ఓఅండ్ఎంలో చేపట్టనున్నారు. ప్రధానంగా కాల్వలు కట్టేసే ముందు గుర్రపుడెక్క, తూడు, కిక్కిస తొలగింపునకు వీలుగా ద్రావకం పిచికారీ చేస్తారు.
- కాల్వలకు నీరు విడుదల చేయగానే లాట్లుగా పేరుకుపోయిన తూడును మనుషుల ద్వారా నీటి సంఘాల పర్యవేక్షణలోనే రైతులు తొలగించనున్నారు.
- ప్రతీ డిస్ట్రిబ్యూటరీ సంఘం పరిధిలో కొంత మేర పనులను నామినేషన్ పద్ధతిలో కేటాయించడంతో సకాలంలో రైతులు సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించడంలో ముందుండి వారి అవసరాలను తీర్చుకుంటారు.

నిర్దిష్ట ప్రణాళికతో చేస్తున్నాం

కాల్వలు, డ్రెయిన్లలో గుర్రపుడెక్క, కిక్కిస, సిల్టు తొలగింపు పనులను నిర్దిష్ట ప్రణాళిక మేరకు చేపడుతున్నాం. నిధుల కొరత లేదు. నీటి సంఘాల ఆధ్వర్యంలో నామినేషన్ పద్ధతిలో ఈ పనులు సాగుతున్నాయి. మార్చి నాటికి అన్ని పనులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

- సీహెచ్ దేవప్రకాశ్, జలవనరులశాఖ ఎస్ఈ

ట్రాక్టర్ గడ్డి రూ.పది వేలు!

» భారీగా వరిగడ్డికి రెక్కలు..
» భారంగా మారిన పశుపోషణ



తెలంగాణలో కొని ట్రాక్టర్‌పై వరిగడ్డి తెచ్చుకుంటున్న పశుపోషకులు

చాట్రాయి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):వరిగడ్డి ధరలకు రెక్కలు వచ్చాయి. పశువులకు గ్రాసం అందించడం భారంగా మారిందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరిపొలాలు బురదగా మారడంతో తప్పని పరిస్థితుల్లో రైతులు ట్రాక్ మిషన్లతో వరికోతలు కోయిస్తున్నారు. ట్రాక్ మిషన్లతో కోస్తే వరిగడ్డి చిన్న చిన్న ముక్కలై మిషన్ చక్రాల కింద పడి బురదలో కూరుకుపోతుంది. ఈకారణంగా వరిగడ్డికి దొరకని పరిస్థితి నెలకొంది. పశుపోషకులు తెలంగాణ సరిహద్దున ఉన్న కందుకూరు, భరిణపాడు తదితర గ్రామాలకు వెళ్లి అధిక ధరలకు వరిగడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్లతో తెచ్చుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ గడ్డి ఇంటికి వచ్చేసరికి రూ.పది వేలు పైగా ఖర్చు అవుతోందని వాపోతున్నారు.

బీడు భూములు కరువు

గతంలో పశువుల మేతకు బీడు భూములు ఉండేవి. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఖరీఫ్ సాగు మాత్రమే జరిగి ఏడాదికి (మిగతా 8వ పేజీలో)

భారంగా మారింది



వరిగడ్డి, దాణా, కాపు కూలీ ఇతర ఖర్చులు విపరీతంగా పెరగడం వల్ల పశుపోషణ రోజురోజుకు భారంగా మారుతోంది. తాతల నుంచి వస్తున్న పని కాబట్టి వదులుకోలేక కష్టమైనా నష్టమైనా బరాయిస్తూ పశుపోషణ కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం పశుపోషకులకు ప్రత్యేక రాయితీలు ఇస్తేనే పాడి పరిశ్రమ మనుగడ ఉంటుంది.

- మందలపు ప్రసాదరావు, పశుపోషకుడు, చీపురుగూడెం, చాట్రాయి మండలం

బిహార్‌లో విజయం..బీజేపీ సంబరాలు



బీజేపీ కార్యాలయం వద్ద జరిగిన సంబరాల్లో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్, ఇతర నాయకులు

ఏలూరు,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం దేశవ్యాప్తంగా స్థిరత్వంతో కూడిన నరేంద్రమోదీ అభివృద్ధి కార్యక్రమాలకు నిదర్శనమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిశోర్ అన్నారు. బిహార్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై అశోక్‌నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో కిశోర్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు జరిపారు. కార్యకర్తలు, నాయకులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఓట్ చోరీ అని ప్రజలను కాంగ్రెస్ నమ్మించడానికి ప్రయత్నించగా ఓటర్లు తిప్పికొట్టారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కురెళ్ల సుధాకర్ కృష్ణ, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా సెక్రటరీ గాది రాంబాబు, మీడియా కన్వీనర్ బాడిత నారాయణరావు, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్ సమీక్ష

ఏలూరు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో పాఠశాలల్లో పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించని ముసునూరు, పెదవేగి, పెదపాడు, ఉంగుటూరు ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఈవో వెంకటలక్ష్మమ్మను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రుచి, శుచి లేని కారణంగా కొన్ని పాఠశాలల్లో కొందరు విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని స్వీకరించడం లేదని, ఈ లోపాలను అధిగమించి నూరు శాతం విద్యార్థులు భోజనాన్ని స్వీకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన భోజనం అందించని ఏజన్సీలపై, సక్రమంగా పర్యవేక్షించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఇటీవల రెండు రోజులపాటు జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేసిన ఆహార కమిషన్ సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, మహిళలకు అందించే ఆహారం నాణ్యత లేకపోవడం, వంట నూనె, గుడ్లు వంటి నిల్వలు సక్రమంగా లేనట్టు గుర్తించారని, సూపర్‌వైజర్లు, సీడీపీవోల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల నివేదికలను సమర్పించాలని ఐసీడీఎస్ పీడీ శారదను ఆదేశించారు. జేసీ అభిషేక్ గౌడ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి నోటీసులు

పెదపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):ఈ నెల 13న సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంపై 'గాడిన పడాలి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. పెదపాడు-1 సచివాలయంలోని వివిధ విభాగాలకు చెందిన తొమ్మిది మంది సిబ్బందికి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ఆదేశించారు.

రేపు గంగానమ్మ జాతరకు ముడుపు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):ఆదివారపుపేటలోని గంగానమ్మ జాతర మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు జాతర కమిటీ శుక్రవారం తెలిపింది. 16వ తేదీ ఉదయం 10.13 గంటలకు ముడుపు కట్టడం, 10.33 గంటలకు రాట నిలబెట్టనున్నట్టు తెలిపారు. గంగానమ్మ జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

APSRTC
టెండరు ప్రకటన
పల్లె వెలుగు

ఏలూరు జిల్లా పరిధిలోని వివిధ డిపోల పరిధిలో గల బస్‌స్టేషన్లలో స్టాల్స్/షాపులు/ క్యాంటిన్/ సైకిల్/ స్కూటర్ స్టాండ్ మొదలగు వ్యాపారములు చేసుకొనుటకు అనుభవము, ఆసక్తి ఉన్న వ్యాపారస్తుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజరు వారి కార్యాలయములలో తేది.15-11-2025 నుండి తేది.24-11-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉదయం 10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు పొందవచ్చును.(2) పూర్తి చేసిన టెండరు ఫారములను తేది.25-11-2025న ఉదయం 10.30 గం॥ల నుండి మ॥02.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయము, ఏలూరు నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.03.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును.(3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://www.apsrtc.ap.gov.in లో Tenders ను చూడగలరు.(4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం.P3/797(06)/2025-DPTO(ELR), తేది:11-11-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, ఏలూరు.

ఎదురొచ్చిన మృత్యువు

» వడ్లమాను వద్ద బైక్‌ను ఢీకొన్న పాల వ్యాను.. ఇద్దరు మృతి..



మృతులు రామకృష్ణ, కోటేశ్వరరావు

ఆగిరిపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం వడ్లమాను వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని పాలవ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. నూజివీడుకు చెందిన బగేతు కోటేశ్వరరావు (38) స్థానికంగా సెల్‌ఫోన్ల సామగ్రికి సంబంధించి చిన్నపాటి దుకాణం నిర్వహిస్తున్నాడు. సామగ్రి తెచ్చేందుకు గురువారం అతనితో పాటు నూజివీడుకు చెందిన దొడ్డపనేని రామకృష్ణ(60) ద్విచక్ర వాహనంపై విజయవాడ వెళ్లారు. పని ముగించుకుని తిరిగి రాత్రి ఆగిరిపల్లి మీదుగా నూజివీడు వస్తుండగా 11:30 గంటల ప్రాంతంలో మార్గమధ్యలోని వడ్లమాను వద్ద గల చప్టా వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన పాల వ్యాన్ ఢీకొట్టింది. రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శుభశేఖర్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న కోటేశ్వరరావును అంబులెన్స్‌లో నూజివీడు ఏరియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వ్యాను డ్రైవర్ ఏలూరుకు చెందిన కఠారి మణికంఠ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా రామకృష్ణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు మీరిన స్కూల్ బస్సులు



నిబంధనలు మీరిన స్కూలు బస్సులు రోడ్లపై రయ్‌రయ్‌మంటూ వెళుతున్నాయి. వీటిపై ఏలూరు మోటారు వాహనాల అధికారులు దృష్టి సారించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన 36 స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. ఐదు లక్షల 14 వేల 400 రూపాయల అపరాధ రుసుము విధించారు. తనిఖీలు ఇలానే కొనసాగిస్తే మరిన్ని బస్సులు బయటపడతాయి. -7లో

ఏడేళ్లకు చిక్కాడు..!

» హత్య.. దొంగతనం చేసి పరార్..
» ఎట్టకేలకు గుడివాడ సమీపంలో పట్టివేత

భీమడోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):హత్య, దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉండి పోలీసులకు చిక్కకుండా ఏడేళ్లుగా పరారీలో ఉన్న వ్యక్తిని భీమడోలు పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. 2018లో ఏలూరు సమీపంలోని సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీ కి చెందిన ఆటో డ్రైవర్ పెదపల్లి దుర్గారామప్రసాద్ (21) పూళ్ల జాతీయ రహదారిపై రాత్రి వేళ తన ఆటోతో వెళ్తున్నాడు. గుడివాడకు చెందిన గూడవల్లి స్టీవెన్(43) ఆటోను అడ్డగించి అతన్ని కొట్టి హత్య చేసి ఆటోను దొంగిలించి తీసుకుపోయాడు. అప్పట్లో కేసు నమోదు కాగా నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. రెండు వాయిదాల అనంతరం నిందితుడు కోర్టుకు హాజరుకు కాకుండా ఏడేళ్లుగా పరారీలో ఉన్నాడు. ప్రత్యేక నిఘా పెట్టిన భీమడోలు సీఐ విల్సన్, ఎస్ఐ మదీనా బాషాలు శుక్రవారం గుడివాడ సమీపంలో అతన్ని అదుపు లోకి తీసుకుని నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించింది.



వణికిస్తున్న చలి

జిల్లాలో చలిగాలులు విజృంభిస్తున్నాయి. గడిచిన రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. ప్రజలు దుప్పట్ల ముసుగులు తీయడం లేదు. రాత్రి అయ్యే సరికి జీలుగుమిల్లిలో చలిమంటలు వేసుకుని సేద తీరుతున్న జనాన్ని చిత్రంలో చూడవచ్చు. -7లో

కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: విజయవాడ, డోర్ నెం.59-12-6, గ్రీస్ లైన్, ఘంటసాలవారి వీధి, గాయత్రినగర్, విజయవాడ, కృష్ణా జిల్లా-520008

సర్ఫేసి చట్టం, 2002 ప్రకారం ఇ-వేలం అమ్మకం ప్రకటన
సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002
(ఇప్పటినుండి చట్టం అని పిలువబడును) క్రింద స్థిర/చరాస్తుల అమ్మకం ప్రకటన.

ఇందుమూలముగా యావన్మందికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు మరియు హామీదారులకు నోటీసు జారీచేస్తూ తెలియచేయునది ఏమనగా కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ వారికి తనఖా పెట్టిన దిగువ తెలిపిన అస్తులను సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం అధీకృత అధికారి గారు స్వాధీనం చేసుకున్నారు. సెక్యూర్డ్ క్రెడిటార్‌కి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మరియు తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులు మొ॥ వాటితో సహా రాబట్టుకొనుటకు ఇ-వేలం ద్వారా సదరు ఆస్తిని అమ్మకం చేయబడును.దిగువ తెలిపిన ఆస్తిని "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" మరియు "పరిహారం చెల్లింపులేని ప్రాతిపదికపై" అనుపద్ధతిలో అన్నివిధాల, చట్టపరమైన బకాయిలు ఇంకా ఏమైనా వాటితో సహా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ (ఇక మీదట రూల్స్ అని పిలువబడును) లోని రూల్ నెం.8 & 9 ల ప్రకారం అమ్మకం చేయబడును.

1 ఋణగ్రహీత పేరు: శ్రీ వాదపల్లి శ్రీనివాసరాజు, తండ్రి: భాస్కర రాజు, డి నెం.1-43, కొక్కిరాయలంక, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా-534004, ఆంధ్రప్రదేశ్. మరియు సహ-ఋణగ్రహీత : శ్రీమతి వాదపల్లి సంగీత వాణి, భర్త: వాదపల్లి శ్రీనివాసరాజు, డి నెం.1-43, కొక్కిరాయలంక, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా-534004, ఆంధ్రప్రదేశ్. మరియు హామీదారు: శ్రీ దానరి కోటేశ్వరరావు, తండ్రి: డి. వెంకటేశ్వరులు, LIG 91, APHB కాలనీ, సత్రంపాడు, ఏలూరు-534004, ఏల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. (CKCC లోన్ అకౌంట్ నెం. 96008282198). మొత్తం బకాయి: తేది 13.05.2025 నాటికి రూ. 83,83,510/- (అక్షరాల ఎనభై మూడు లక్షల ఎనభై మూడు వేల ఐదు వందల పది రూపాయలు మాత్రమే) మరియు తేది 13.05.2025 నుండి వడ్డీ. స్థిరాస్తి వివరములు: ఆంధ్రప్రదేశ్, ప్రస్తుతం ఏలూరు జిల్లా (ఇంతకుముందు పశ్చిమ గోదావరి జిల్లా), ఏలూరు, పద్మానగర్ వద్ద 1వ వార్డు, శాంతి నగర్, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, శాంతి నగర్, పద్మానగర్, శ్రీ బాల దుర్గా దేవి గుడి దగ్గర, అసెస్‌మెంట్ నెం.1075043294 (ట్యాక్స్ ప్రకారం), రెవెన్యూ వార్డు నెం.29 (పన్ను ప్రకారం), మున్సిపల్ వార్డు నెం.1, సమీప డోర్ నెం. 28-1-53/30/2, ఆర్.ఎస్. నెం.80/6 భాగం, ప్లాట్ నెం.4 నందు విస్తీర్ణం 267 చ॥గ॥లు లోని ఖాళీ స్థలం. హద్దులు : తూర్పు : 33 అ॥ల వెడల్పు రోడ్డు - 42', దక్షిణం: ప్లాట్ నెం.5 యొక్క స్థలం - 57.3', పడమర : కోసూరి రంగారావు వగైరా వారి భూమి - 42', ఉత్తరం : ప్లాట్ నెం.3 యొక్క స్థలం - 57.30'. ఏలూరు ఎస్ఆర్‌ఓ, రిజిష్టర్డ్ పార్టీషియన్ డీడ్ డాక్యుమెంట్ నెం.2158/2017, తేది.17.03.2017 ప్రకారం శ్రీ వాదపల్లి శ్రీనివాస రాజు, తండ్రి : వి. భాస్కర రాజు గారి పేరున గల అస్తి. విస్తీర్ణం: 267 చ॥గ॥

రిజర్వు ధర: రూ. 56,74,000/- ధరావత్తు సొమ్ము: రూ. 5,67,400/-

ఆసక్తి గల బిడ్డర్లు టైటిల్ డీడ్ మరియు ఇతర అందుబాటులోనున్న డాక్యుమెంట్లను మా ఏలూరు బ్రాంచ్‌లో చూసుకోవచ్చును. సంప్రదించండి. ఫోన్ నెం. 08812-222519, మొబైల్ నెం. 9866625033.

బ్యాంకుకు తెలిసి ఆస్తికి సంబంధించిన ఏవైనా ఎన్‌కంబ్రెన్స్‌లు (ఇతర సౌకర్యం లేదా సంస్థ కొరకు తనఖా పెట్టిన ఆస్తి)	లేవు
అధీకృత అధికారికి తెలిసిన స్థానిక ప్రభుత్వ బకాయిల వివరములు (ఆస్తి పన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లులు మొ॥)	సంబంధిత విభాగం వారి ఉత్తర్వుల ప్రకారం
ఇ-వేలం తేది మరియు సమయం	తేది 03-12-2025 ఉ॥ 11.00 గం. నుండి మ॥ 1.00 గం.ల వరకు
వేలం సమయం పొడిగింపు	చివరి 5 నిమిషాల్లో చెల్లుబాటు అయ్యే బిడ్‌పై 5 నిమిషాలు
ఇ-వేలం జరుగు వెబ్‌సైట్	https://sarfaesi.auctiontiger.net
బిడ్లు సమర్పించుటకు ఆఖరి తేది	తేది 02-12-2025, సాయంత్రం 5 గం.ల వరకు
కనీస బిడ్ పెంపుదల సొమ్ము	రూ. 10,000/-
ఆసక్తి గల కొనుగోలుదారు అస్తి తనిఖీకు తేది మరియు సమయం	ముందస్తు అనుమతితో బ్యాంకు పనివేళలలో తేది. 01-12-2025 వరకు సా॥ 5.00 గం.లోపు

ఒకవేళ సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన బ్యాంక్ వారికి పైన తెలిపిన ఏదైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఆస్తులు కొనుగోలు చేయాలని భావిస్తే వారు కూడా పాల్గొనవచ్చు మరియు ఇ-వేలంకు బిడ్ వేయవచ్చును. ధరావత్తు సొమ్మును అకౌంట్ నెం: 96007821585, ఐఎఫ్ఎస్ కోడ్: COAS0000001. బ్యాంక్ పేరు: కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ బ్రాంచ్, కృష్ణా జిల్లా వారికి జమచేయవలెను. ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ క్రియేట్ చేయుటకు, డేటాను అప్‌లోడ్ చేయడం, బిడ్ సమర్పించడం, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొదలైన వాటిలో సహాయం కొరకు సంప్రదించండి: https://sarfaesi.auctiontiger.net, బి-704, వాల్ స్ట్రీట్-II, ఓరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ కాలేజ్ దగ్గర, ఇల్లిస్ బ్రిడ్జ్, అహ్మదాబాద్-380006 లేదా శ్రీ. ప్రవీణ్ కుమార్ థేవర్, సెల్: 9722778828, డి: 079-68136842/6837/6875, ఇ-మెయిల్ ఐడి: Praveen.thevar@auctiontiger.net లేదా Support@auctiontiger.net మరియు అస్తికు సంబంధించిన వివరములకు చీఫ్ మేనేజర్ గారిని సంప్రదించగలరు. ఫోన్: 90034 49918.

తేది: 13-11-2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్



నేడు ఉత్థాన ఏకాదశి

శ్రీమహావిష్ణువుకు ప్రత్యేక పూజలు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్థాన ఏకాదశి ఎంతో పవిత్రమైనదని రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు తెలియజేశారు. శ్రీ మహావిష్ణువు పాల కడలిలో ఆదిశేషుని పాన్పుపైన ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు తన యోగ నిద్రను ప్రారంభించి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు కనులు విప్పి యోగ నిద్ర నుంచి మేల్కొన్న రోజునే ఉత్థాన ఏకాదశి అని పురాణాలు తెలియజేస్తున్నాయన్నారు. ఆ మరుసటి రోజు ద్వాదశి నాడు ముగ్గురు దేవతలలో శ్రీ మహాలక్ష్మీ సమేతుడై తులసీ ధాత్రి వనమందు ఉంటారని తెలిపారు. ఈ ద్వాదశిని క్షీరాబ్ధి ద్వాదశి అని అంటారన్నారు. పూర్వం కృతాయుగంలో దేవదానవులు పాలను ముద్రమదనం చేసిన రోజు అన్నారు. కనుక దీనికీ క్షీరాబ్ధి ద్వాదశి అని పేరు వచ్చిందన్నారు. పాల సముద్రంను చిలికినారు కావున శిల్కు ద్వాదశి అని కూడా పిలుస్తారన్నారు. మహిళలు ఈ రోజు వారి సౌభాగ్య సంపద కోసం తులసీ ధాత్రి వనమందు విశేష దీపారాధనలు గావించి షోపాచారములతో తులసీ ధాత్రి లక్ష్మీనారాయణులను పూజిస్తారు. ఆ రోజు దేశం నలుమూలల గల ఆలయాల్లోని లక్ష్మీనారాయణ మూర్తులను మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో, బాణసంచాలతో సమీప నదీ జలాలతో తెప్పోత్సవం నిర్వహిస్తుంటారు. ఏకాదశి, ద్వాదశిలను రామానుజాచార్యులు వివరించారు. ఉత్థాన ఏకకాదశి, క్షీరాబ్ధి ద్వాదశిలలో శ్రీ మహావిష్ణువును, లక్ష్మీనారాయణులను ఆరాధించడం ద్వారా, పూజించడం ద్వారా కోరిన కోర్కెలు తీరుతాయని వివరించారు.

ప్రదక్షిణ మార్గాన్నే అనుసరించాలి

అహోబిల జీయర్ స్వామి సూచన



ఆలయంలో క్యూలైన్‌ను పరిశీలిస్తున్న స్వామిజీ

ద్వారకాతిరుమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏ ఆలయంలోనైనా ప్రదక్షిణ మార్గంలోనే వెళ్లి గర్భాలయంలోని మూలవిరాట్‌లను దర్శించుకోవడం సనాతన సంప్రదాయమని.. అప్రదక్షిణగా పయనించి పలువురు ఇబ్బందులు పడ్డట్టు పురాణాల్లో ఉందని శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామిజీ అన్నారు. చినవెంకన్న ఆలయాన్ని శుక్రవారం ఉదయం ఆయన సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు జరుపుకున్నారు. ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఆయనకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఆయన తన శిష్యబృందంతోను, సంఘసేవకుడు బీకేఎస్ఆర్ అయ్యంగార్‌తో కలసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ ప్రధానార్చకులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాథాచార్యులు నుంచి పలు వివరాలను రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో ప్రమాదవశాత్తు గోవులు తమ శరీరాన్ని వదలి పెట్టాయని అందువల్ల ఆ స్వామిని దోషపరిహారం కోసం ప్రార్థన చేయాలని చెప్పారు. సహజంగా ఆలయంలో ప్రదక్షిణగా వెళితే దైవంతో మనకు బంధం ఏర్పడుతుందన్నారు. ఆలయంలో గరుత్మంతుడు, ఆంజనేయుడు పెరుమాళ్ల పాదాలను చూసేలా ఉండాలని అంతే కానీ ఇక్కడ వారు భక్తుల పాదాలు చూసేలా ఉన్నారని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఈవో మూర్తికి సూచించారు. కుచ్చెలమెట్ట ఉత్సవాన్ని, పొన్నచెట్టు వాహనోత్సవాన్ని పునరుద్ధరించాలని కోరారు.



కపర్దీశ్వర స్వామికి హరీశ్ శంకర్ పూజలు

తణుకు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తణుకు పాతూరులోని పార్వతీ సమేత కపర్దీశ్వర స్వామిని శుక్రవారం ప్రముఖ సినీ దర్శకుడు హరీశ్ శంకర్ దర్శించుకున్నారు. ఇటీవల ఆలయంలో నందీ శ్వరుని విగ్రహం పునః ప్రతిష్ఠ చేశారు. దీంతో పాటు కార్తీక మాసం కావడంతో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివయ్యపట్ల నమ్మకం ఉంచితే ఖచ్చితంగా అనుకున్న కోరికలు తీరతాయని శంకర్ అన్నారు. పట్టణానానికి స్థల పురాణం ఉందని, ఆ నమ్మకంతోనే ఇక్కడ శివుడుని దర్శించుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ శివలింగాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం అని అన్నారు.

గరగపర్రులో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ నాయకులు

పాలకోడేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గరగపర్రులో అంబేడ్కర్ విగ్రహాన్ని తక్షణం ఆవిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గరగపర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కేవీపీఎస్ జిల్లా బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ గరగపర్రు గ్రామంలో 2017లో దళితుల సాంఘిక బహిష్కరణ, వెలివేతపై సుదీర్ఘకాలం కేవీపీఎస్, ఇతర దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు జరిగాయని తెలిపారు. సుమారు ఎనిమిదేళ్ళు పూర్తయ్యిందన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని సెంటర్‌లో పెట్టడాన్ని నిరసిస్తూ దళితులను సాంఘిక బహిష్కరణ చేస్తే అప్పుడు జరిగిన పోరాటాల ఫలితంగా గ్రామ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విగ్రహ నిర్మాణం జరిగి సుమారు ఐదేళ్ళు పైనే పూర్తవుతున్నా నేటికీ ఆ విగ్రహాన్ని ఆవిష్కరించకపోవడం అన్యాయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కె.రఘురామకృష్ణంరాజు చొరవ తీసుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కె.క్రాంతిబాబు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ వాహనాలు స్వాధీనం

ఏలూరు టూటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మురుగునీటి శుద్ధి వాహనాలు తీసుకున్న లబ్ధిదారులు సక్రమంగా వాయిదాలు చెల్లించకపోవడంతో ఆ వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి తెలిపారు. ఈ నెల 16వ తేదీ లోపు వాయిదాలు చెల్లించి లబ్ధిదారులు వాహనాలు తీసుకువెళ్లాలని అన్నారు. లేని పక్షంలో ఈ వాహనాలను అర్హులైన లబ్ధిదారులకు ఇస్తామన్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు మునిసిపాలిటీల పరిధిలో ఒక్కో వాహనాన్ని లబ్ధిదారులకు కేటాయించామన్నారు.

ఎన్నెన్నో వేషాలు..



తణుకు ప్రగతిలో విద్యార్థుల వేషధారణలు

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని శుక్రవారం బాలల దినోత్సవంగా జరుపుకున్నారు. ఇది బాలలకు ఒక పండుగ. విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు బాలల దినోత్సవాన్ని ఘనంగా జరిపాయి. పిల్లలు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వివిధ వేషధారణలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు.







ఏలూరులోని శ్రీమతి ఈదర సుబ్బమ్మ దేవి మునిసిపల్ స్కూల్‌లో వేషధారణలో విద్యార్థులు.. ఏలూరు జిల్లా గ్రంథాలయంలో విద్యార్థినుల నృత్యాలు.. తణుకు ప్రగతి విద్యాలయంలో విద్యార్థి వేషధారణ



టెన్నిస్ విజేతలతో నిర్వాహకులు

ముగిసిన జాతీయ టెన్నిస్ పోటీలు

ఫైనల్స్‌లో విజేతలకు బహుమతులు అందజేత

పాలకొల్లు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సీహెచ్ బుద్దావతారం రాజు మెమోరియల్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోర్టులో సింగిల్స్, డబుల్స్ ఫైనల్ మ్యాచ్‌లు హోరా హోరీగా జరిగాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ గొట్టుముక్కల భూన్‌రాజు తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి 230 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని, శుక్రవారం సాయంత్రం జరిగిన పోటీల్లో విజేతలకు (45, 55, 65, 70 విభాగాలు) ఫైనల్స్ అనంతరం అదే ఆవరణలో బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వ హించారు. సంస్థ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అధ్యక్షతన జరి గిన సభ లో ముఖ్య అతిధులుగా మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, ఏఎంసీ చైర్మన్ కోడి విజయ భాస్కర్‌లు విజేతలకు బహుమతులు, నగదు పురస్కారాలు అంద జేశారు.

- 75 గ్రూపు (డబుల్స్)లో విన్నర్స్ : రాధాకృష్ణ (చెన్నై), నాయుడు (అనకాపల్లి), రన్నర్స్ వైవి రామకృష్ణ (తెలంగాణ), ఏఎస్ఎన్ రాజు(నరసాపురం)
- 70 గ్రూపు డబుల్స్ విభాగంలో ఎస్.సేతు (తమిళనాడు), ఎ.రామ్‌బాబు (తెలంగాణ), రన్నర్స్‌గా రాధాకృష్ణమూర్తి (విజయవాడ), జీవీ సన్యాసి నాయుడు (విజయనగరం)
- 70 విభాగం సింగిల్స్‌లో: ఎస్.సేతు (తమిళనాడు), రన్నర్స్‌గా జీవీ సన్యాసి నాయుడు (విజయనగరం)
- 65 విభాగంలో డబుల్స్: వి.శ్రీనివాసరెడ్డి (అనంతపురం), ఎస్ఎస్ రాధ (ఒరిస్సా), రన్నర్స్‌గా జి.బాల సుబ్రహ్మణ్యం, పార్థసారధి (తమిళనాడు)
- 65 సింగిల్స్ విభాగం: వి శ్రీనివాసరెడ్డి (అనంతపురం) రన్నర్ ఎం ఉదయ్ భాస్కరరాజు
- 55 విభాగం డబుల్స్: ఆర్ఎస్ రమేష్ (మైసూర్), పాల్ మనోహర్ (తెలంగాణ), రన్నర్స్ మణికృష్ణ (శ్రీకాళహస్తి), జాస్త మహన్ని (ఒరిస్సా),
- 55 విభాగంలో సింగిల్స్ : ఆర్ఎస్ రమేష్ మైసూర్, రన్నర్ సీతల్ కుమార్ తమిళనాడు
- 45 విభాగం డబుల్స్ : ఎంవీఎల్ఎన్‌రాజు (విశాఖపట్నం), దినకర్‌రెడ్డి (తిరుపతి), రన్నర్స్ టి. రామారావు (విశాఖపట్నం), ఎంవీఎన్ఎస్ మధు(విశాఖపట్నం)
- 45 విభాగం సింగిల్స్: రెడ్డి నాగరాజు (హిందూపురం), రన్నర్ ఎంఎస్ కిరణ్,(మైసూర్) విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు అందించారు.



ఒకే చెట్టుకు రెండు రకాల పూలు

ద్వారకాతిరుమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒక మందార మొక్కకు రెండు రకాల రంగుల పూలు పూయడం అబ్బురపరిచింది. రామన్నగూడెంకు చెందిన మాజీ సర్పంచ్ పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు పెరటిలో కొన్నాళ్ల క్రితం మందార మొక్కను నాటారు. అయితే అది గులాబి రంగు మందారం, తె లుపు రంగు మందారం పూలు పూయడంతో స్థానికులు వాటిని ఆసక్తిగా తిలకించారు.



డాక్టర్ చంద్రశేఖర్‌శర్మను పుష్పగుచ్ఛం అందించి జ్ఞాపికతో సత్కరిస్తున్న ఏపీ నిట్ ఆచార్యులు

పరిశోధనలు విస్తరించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంస్థలతో పరిశోధనా సహకారాన్ని విస్తరించడంతో పాటు పరిశోధనా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని ఏఎన్ఆర్ఎఫ్ ఫెయిర్ ప్రాజక్టు డైరెక్టర్, ఐఐటీ ఆచార్యులు డాక్టర్ చంద్రశేఖర్ శర్మ అన్నారు. శుక్రవారం ఏఎన్ఆర్ఎఫ్ ఫెయిర్ ప్రథమ ప్రాజక్టు సమావేశాన్ని తాడేపల్లిగూడెం ఏపీనిట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతూ ఫెయిర్ ప్రాజక్టు ద్వారా లభ్యమయ్యే పరిశోధనలకు సంబంధించిన సహకారం వంటి అంశాల గురించి వివరించారు. నిట్‌లో ఏడుగురు ఆచార్యులు, 11 మంది విద్యార్థులకు హైదారాబాద్‌లోని ఐఐటీలో రెండు నెలల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ శర్మను డీన్ రీసెర్చ్ అండర్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పుష్పగుచ్ఛం, జ్ఞాపికలతో సత్కరించారు.

శ్రీవారికి ఎమ్మెల్యే మద్దిపాటి పూజలు

ద్వారకాతిరుమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం సందర్శించారు. ఆలయానికి కూటమి నేతలతో కలసి తన పుట్టినరోజు సందర్భంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా ఆయన ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం బంగారు వాకిలి నుంచి లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో ఆయనకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు.

అట్టహాసంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు జన్మదిన వేడుకలు ద్వారకాతిరుమలలోని వి కన్వెన్షన్ కల్యాణ మండప ఆవరణలో శుక్రవారం ఉదయం అట్టహాసంగా జరిగాయి. ఆయన అభిమానులు ఎంతో ఉల్లాసంగా పాల్గొని విషెస్ చెప్పడానికి పోటీ పడ్డారు. ఉదయమే ఆయన దైవదర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అప్పటికే పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే అభిమానులు ఆయనకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నా రు అనంతరం ఎమ్మెల్యే 200కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికు లకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలం లోని జికొత్తపల్లిలో సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పేరున అక్కడి ఉమా రామ లింగేశ్వరుని ఆలయంలో పూజలు జరిపి అన్నస మారాధన జరిపారు. అలాగే ఆయన రామసింగవరం జడ్పీపాఠశాల ప్రహరీకి గేటును అందజేశారు.



ద్వారకాతిరుమలలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మద్దిపాటికి శ్రీవారి ఆలయంలో పూర్ణకుంభ స్వాగతం

పాలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి



మహిళలతో మాట్లాడుతున్న ఏపీ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ సీఈవో మురళీధర్

తణుకు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన, స్వచ్ఛమైన పాలనను ప్రజలకు అందించేందుకు పాల సహకార సంఘాల కృషి అభినందనీయమని ఏపీ పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ కమిషనర్, సీఎండీ కె.మురళీధర్ చెప్పారు. శుక్రవారం సాయంత్రం దువ్వ గ్రామంలో మహిళా సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాల సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధర లభించేలా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేలా తమ సంస్థ సహకారం అందిస్తుందన్నారు. ఈసమావేశంలో పాల ఉత్పత్తుదారుల సంఘం తరపున సంఘ అధ్యక్షురాలు పావని అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీడీడీసీఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.వెంకట రమణ, ఏపీ డెయిరీ జిల్లా మేనేజర్ బి.ఫణీంద్ర, ఏపీ డెయిరీ కో-ఆర్డినేటర్ పి.గంగాధర్, డెయిరీ ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎన్ రవి కుమార్ పాల్గొన్నారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం



విశాఖలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్ళలో 20లక్షల ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ముందుడుగు పడిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం విశాఖపట్నంలోని సీఐఐ భాగ స్వామ్య సదస్సులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 50ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయన్నారు. 38 మెగా పరిశ్రమలు సీఎం ప్రారంభించడం గర్వకారణమన్నారు. ఒక్క ఎంఎస్ఎంఈల ద్వారానే 5లక్షల మంది యువతకు నేరుగా ఉద్యోగాలు లభిస్తామని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

లింగపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలను ధర్మాజీగూడెంలోని క్రిసాలిస్ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే జయరాజు తెలిపారు. ధర్మాజీగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలలో రాణించి అర్హులైన క్రీడాకారులతో ఆంధ్రప్రదేశ్ నెట్‌బాల్ టీంను ఏర్పాటు చేస్తామని ఆ టీం క్రీడాకారులు డిసెంబర్ 25వ తేదీ నుంచి 30 వరకు కర్నాటకలో జరగనున్న ఆలిండియా నెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని అన్నారు.







ప్రత్యేక అలంకరణలో భీమవరం సోమేశ్వర స్వామి.. పద్మంలో శివలింగంతో అలంకారం.. అలంకరణలో క్షీరామ రామలింగేశ్వర స్వామి

పంచారామ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

సోమేశ్వరునికి జ్యోతిర్లింగార్చన

భీమవరం టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన చేశారు. స్వామివారికి ఏకదశ వార రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామికి లక్ష బిల్వార్చన, ఆలయ మండపంలో జ్యోతిర్లింగార్చన, శాంతి కల్యాణం నిర్వహించారు.

రేపు అభిషేకాలు ఏడు గంటల వరకే..

గునుపూడిలోని సోమేశ్వరస్వామికి ఆదివారంనాడు ఉదయం 7 గంటల వరకే అభిషేకాలు నిర్వహిస్తారని ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. అదే రోజు ఆలయం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక అన్న సమారాధన నిర్వహిస్తున్న నేపథ్యంలో అర్చకుల సూచనల మేరకు అభిషేకాలు 7 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.



సోమేశ్వరాలయంలో జ్యోతిర్లింగార్చన

క్షీరా రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్షీరారామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఈసందర్భంగా వచ్చిన 3000వేల మంది భక్తులకు రేపాక వారి సత్రంలో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. 13వ తేదీన స్వామివారి ఆలయంలో అభిషేకం టికెట్ల ద్వారా రూ.48.340, లడ్డు విక్రయాల ద్వారా రూ.12.225, మొత్తంగా రూ. 60.565 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

ఖతార్‌లో ఉద్యోగావకాశాలు

ఏలూరు రూరల్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్‌వర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త భాగస్వామ్యంతో ఖతార్‌లోని నిర్మాణ రంగంలో నైపుణ్య ఉద్యోగాల కోసం అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. అనుభవజ్ఞులైన నిర్మాణ కార్మికులకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యమన్నారు. వెల్డింగ్ వర్క్స్‌లో అనుభవజ్ఞులైన డిప్లొమా కలిగి ఉండి, 10 సంవత్సరాల అనుభవం ఉన్న 45 ఏళ్ళ మధ్య వయస్సు కలిగిన పురుష అభ్యర్థుల నుంచి 2 సంవత్సరాల కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నెలకు సుమారుగా రూ.1.94 లక్షల నుంచి రూ.2.38 లక్షలు వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడేటా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. మరింత సమాచారానికి 99888 53335 నంబరులో సంప్రదించాలన్నారు.

ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల వేడుక



వందేమాతర గీతాలాపన చేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి): వందేమాతరం స్ఫూర్తితో స్వా తంత్ర్య ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన మహనీయులు, కోట్ల మంది దేశ ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకోవడానికి కారణమైన ప్రతి ఒక్కరి త్యాగం స్మరణీయమని వైఎంహెచ్ఏ ప్రతినిధులు పేర్కొన్నారు. ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాం గణంలో శుక్రవారం బాలల దినోత్సవం, వందేమాతరం 150 ఏళ్ల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉదయం బాల ల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నృత్య ప్రదర్శనలు అలరించాయి. సాయంత్రం 200 మంది వందే మాతరం గీతం ఆలపించారు. వందే మాతరం గీతం దేశభక్తిని స్వాతంత్ర్య సాంస్కృతిక వైభవాన్ని గుర్తు చేసింది. అనంతరం కళాభివృద్ధికి కృషి చేస్తున్న కళాకారులను పురస్కారాలతో సత్కరించారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కార్యకర్తలే టీడీపీకి అండ : మంత్రి నిమ్మల

పాలకొల్లు రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీకి అండాదండా పార్టీ కార్యకర్తలేనని, వారి రుణం ఏమిచ్చినా తీరనిదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. లంకలకోడేరులో శుక్రవారం జరిగిన మండల కమిటీ ప్రమాణస్వీకార సభలో ఆయన మాట్లాడారు. కష్టపడే వారిని గుర్తించి సముచిత స్థానం కల్పించడమే టీడీపీ అజెండా అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల కమిటీ బాధ్యతగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మండల అధ్యక్షుడు పాముల రజనీకుమార్, ప్రధాన కార్యదర్శి కలిదిండి రామచంద్రరాజు, కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీలతో మంత్రి రామానాయుడు ప్రమాణస్వీకారం చేయించారు. పూలపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి లంకలకోడేరు వరకూ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంత్రి రామానాయుడు బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, సర్పంచ్ చొప్పల రజని, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి బాబు, దాసరి రత్నరాజు, కర్నేన రోజారమణి, కర్నేన గౌరునాయుడు, శాగా సత్యనారాయణ, కాపవరం ఉప సర్పంచ్ అంగర చిన్న, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో వినతులు స్వీకరిస్తున్న షరీఫ్, పొత్తూరి, కొల్లు

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

నరసాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో పొత్తూరి రామరాజు, కొల్లు పెద్దిరాజుతో కలిసి శుక్రవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. పార్టీ నేతలకు వినతులందించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కార్యాలయానికి తరలివచ్చారు. ఎక్కువగా ఇళ్లు, పింఛన్లు, రోడ్లు, డ్రెయినేజీ పూడిక సమస్యలపై వినతులు వచ్చాయి. ఆయాశాఖల అధికారులతో షరీఫ్ ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కారించాలని విన్నవించారు. ప్రజల నుంచి మొత్తం 91 వినతులు అందాయి. ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, వాతాడి ఉమా, నాట్ర నరేష్, మౌలాలీ, శ్రీదేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

తాడేపల్లిగూడెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన వినతిపత్రాలను తీసుకున్నారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఎన్నికల హామీలను అమలు చేశామన్నారు. ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని భవన, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. బాబ్జి మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం కార్యక్రమం జరుగుతుందని, అర్జీలపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆకాశపు స్వామి, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, బండారు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పెనుగొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. అంగన్‌వాడీలు అన్ని గ్రామ సచివాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు అందించారు. సీఐటీయు జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌కె పాదుషా మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం ఆపాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో ప్రీ స్కూలు పిల్లలు తగ్గిపోతున్నారంటూ విలీనం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలు తక్షణం ఆపాలన్నారు. అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్ పిల్లలకు ప్రభుత్వమే రక్షణ కల్పించాలన్నారు. కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటల వరకు ఉండే పిల్లలకు బిస్కెట్స్ అందించాలని కోరారు. అంగన్‌వాడీలు కానూరి తులసి, కేయు ఎం భవాని, ఎ. విజయ, ఎస్. కృష్ణవేణి, ఎస్. ఉష్మశ్రీ పాల్గొన్నారు.

పాడి సంపద వృద్ధికి కృషి



చూడి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఫణికుమార్

పెనుగొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాడి సంపద వృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ కోటి లింగరాజు అన్నారు. వడలిలో పశు సంవర్ధక శాఖ ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ కాసాని విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త నిర్వహణలో గ్రామీణ పశు వైద్యశాలలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పెయ్యి దూడల అందాల పోటీలను నిర్వహించారు. 30 దూడలు పాల్గొనగా రైతులు ప్రోత్సాహకాలుఅందుకున్నారు. 120 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. డీడీ డాక్టర్ ఎల్‌కె సుధాకర్, ఏడీ డాక్టర్ బొడ్డు ప్రసాద్, డాక్టర్ ఫణి కుమార్, డాక్టర్ రవికాంత్, డాక్టర్ నీలిమ, జూనియర్ వెటర్నరి ఆఫీసర్ టి.కిషోర్, కూటమి శ్రేణులు దొడ్డిపట్ల నాగూర్, ఉప్పలపాటి చంటి, అంగర వరప్రసాద్, గణపతినీడి బుల్లియ్య, మేకా శివయ్య, బొర్రా త్రిమూర్తులు, కంకిపాటి శ్యాంబాబు, ఉప్పలపాటి లక్ష్మణరావు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ పెద్దిరాజు

పోడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకొని అధికారులు గ్రామాల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు కోరారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చి ప్రజలు సమస్యలు చెప్పుకుంటారని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కొమ్ము చిక్కాల నుంచి లంకలకోడేరు ఆర్‌అండ్‌బి రోడ్డు కాపవరం వద్ద గోతులతో అధ్వానంగా ఉందని వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పెద్దిరాజు అధికారులను కోరారు. సమావేశంలో పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ రెండేళ్లుగా ఎంపీటీసీ గౌరవవేతనం చెల్లించడం లేదన్నారు. ఇటీవల కొత్తగా ఇచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులు తప్పులు తడకలుగా ఉన్నాయని వాటిని సరిచేసి కొత్తకార్డులు ఇవ్వాలని పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎంపీటీసీ పోడూరి నాగరాజారావు కోరారు. సమావేశానికి ఎంపీపీ సబ్బితి సుమంగళి అధ్యక్షత వహించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, ఎంపీడీవో బి.మంగాకుమారి, తహసీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో చలి మంటలు

గజగజ..

- వణికిస్తున్న చలి గాలులు
- 16 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
- చలికి అల్లాడుతున్న ప్రజలు

ఏసీలు ఆఫ్ అయ్యాయి. దుప్పట్లు, రగ్గులు మంచం ఎక్కాయి. రెండు రోజులుగా చలి ప్రజలను వణికిస్తోంది. విద్యార్థులు, ఉద్యోగులు, పనులకు వెళ్లే వారికి మాత్రం చలి బెడద తప్పడం లేదు. తెల్లవారుజామునే పొలాలకు వెళ్లే రైతులు, అయ్యప్ప తదితర దీక్షలు చేపట్టిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచుతోపాటు వీస్తున్న చలి గాలులకు ఏజెన్సీ ప్రజలు గజగజ వణికిపోతున్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్/ఏలూరు సిటీ/ జీలుగుమిల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు రోజులుగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. గురు, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల వరకు చలిగాలులు తీవ్రత కొనసాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి నవంబరు 13న రాత్రి ఉష్ణోగ్రత 15 డిగ్రీలకు, 14న 16 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదైంది. రాబోయే రోజుల్లోను చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. ఉత్తర దిశ నుంచి వస్తున్న చల్లని గాలుల ప్రభావమే కారణమని చెబుతున్నారు. చలికి గాలులు తోడవడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. పశ్చిమ ఏజెన్సీని చలి వణికిస్తోంది. ఇటీవల ఏజెన్సీలో కురిసిన వర్షాలకు అడవులు సైతం దట్టంగా పెరగటంతో చలి అధికమైంది. పొగాకు, మిర్చి, కూరగాయలు సాగు ప్రారంభంలోను, ఖరీఫ్ పంటల సాగు చివర దశలో ఉండటంతో రైతాంగమంతా స్వెట్టర్లు, రగ్గులను కప్పుకుని పొలం పనులకు వెళ్తున్నారు. ఏలూరు నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, కొవ్వూరు, తణుకు, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, ఆకివీడు ప్రాంతాల్లోను ఉష్ణోగ్రతలు రాత్రి సమయాల్లో తక్కువగానే నమోదవుతున్నాయి. గోదావరి పరివాహక ప్రాంతాల్లోను, కృష్ణా పరివాహక ప్రాంతాల్లోను చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. గొంతు సంబంధిత వ్యాధులు ఎక్కువగా సంక్రమిస్తున్నాయని చెబుతున్నారు. చలి గాలుల సమయంలో ద్విచక్ర వాహనాలపై వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

ఉన్ని దుస్తులకు డిమాండ్

ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి ఉన్ని దుస్తులు తీసుకువచ్చి జిల్లాలో దుకాణాలను ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలోని పట్టణాలు, మండల కేంద్రాల్లో ఇప్పటికే ఉన్ని దుస్తుల విక్రయాలు జోరందుకున్నాయి. అలాగే తెల్లవారు ఝామున 5 గంటల లోపే టీ దుకాణాలు తెరుచుకుంటు న్నాయి.



జంగారెడ్డిగూడెంలో వెలసిన ఉన్ని దుస్తుల దుకాణం

అప్రమత్తంగా ఉండాలి : మలేరియా అధికారి

ఏలూరు అర్బన్: శీతాకాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు సూచించారు. శుక్రవారం ఏలూరులో జరిగిన కార్యక్రమంలో శీతాకాలంలో సంభవించే వ్యాధులపై అవగాహన కల్పించారు. చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా శ్వాసకోశ వ్యాధులు, జ్వరాలు బారినపడే ప్రమాదం ఉందని, చలిలో తిరగరాదని, ఉన్ని దుస్తులు ధరించాలని, శీతల పానీయాలు, చల్లని నీరు తీసుకోరాదని కోరారు. ఆయాసం, ఉబ్బసం, న్యుమోనియా, జ్వరాలతో బాధపడుతుంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. పరిస రాల్లో దోమలు వృద్ధి చెందకుడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

పారదర్శకంగా సేవలందించాలి

సహకార వారోత్సవాల్లో డీసీసీబీ చైర్మన్ గన్ని

ఏలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అఖిల భారత 72వ సహకార వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో ఆప్కాబ్, డీసీసీబీల చైర్మన్ గన్ని వీరాంజనేయులు సహకార జెండాను, వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సహకార సంఘాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని, ఉద్యోగులు, అధికారులు పారదర్శకంగా రైతులకు, ప్రజలకు విరివిగా సేవలందించి అభిమానం చూరగొనాలని గన్ని ఆకాంక్షించారు. రాబోయే కాలంలో వినూత్నంగా సేవలందిస్తామన్నారు. ఆన్‌లైన్ పరంగా సేవలను కింది స్థాయికి చేరేలా ప్రణాళికాబద్ధంగా సాగుతున్నట్లు వీరాంజనేయులు వివరించారు. బ్యాంకు జీఎం శ్రీనివాసరావు, డీజీఎం రమణమ్మ,సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని డీసీవో కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్ సహకార జెండాను ఆవిష్కరించారు. ఉద్యోగులు, సిబ్బంది ఐక్యంగా పనిచేసి సహకార శాఖకు వన్నె తేవాలని సూచించారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి కె. వెంకటేశ్వరరావు, ఏలూరు డీఆర్ కె. సత్యవతి, కార్యాలయ సూపరింటెండెంట్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.




భీమవరంటౌన్: జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మ వారిని పవిత్రాలతో అలంకరించారు.





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ (ఇన్‌సెట్) హాజరైన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు

కచ్చిత ఆర్థిక నిర్వహణ తప్పనిసరి

సమీక్షా సమావేశంలో జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

ఏలూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి పనితీరు మెరుగుపరచుకోవటానికి సమయపాలన, పారదర్శకత, కచ్చితమైన ఆర్థిక నిర్వహణ తప్పనిసరిగా ఉండాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ సూచించారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయాల కార్యకలాపాలపై శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమలోని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఏఓలతో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, జడ్పీ సీఈఓ ఎం. శ్రీహరి, డిప్యూటీ సీఈఓ కె. భీమేశ్వర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయాల్లో అన్ని రకాల గ్రాంట్ల సర్దుబాటు పురోగతి, గౌరవ వేతనాలు విడుదల, పెండింగ్ అంశాలు, సాలుసరి పరిపాలన నివేదికల అప్‌డేట్‌పై సమీక్షించారు. మండల పరిషత్ సమావేశాలు జరుగుతున్నప్పుడు ప్రజా ప్రతినిధులను కచ్చితంగా ఆహ్వానించాలన్నారు. మండల స్థాయిలో సమన్వయాన్ని మెరుగుపరచటం, నిధుల వినియోగంపై బాధ్యతాయుత నిర్ణయాలు తీసుకోవటం, ప్రజా సేవలు వేగవంతంగా అందించటంపై జడ్పీ సీఈఓ ఎం. శ్రీహరి, డిప్యూటీ సీఈఓ కె. భీమేశ్వర్ సూచించారు.

ప్రకృతిని కాపాడుకోవాలి: జడ్పీ సీఈవో

పరిశుభ్రతతో పాటు పచ్చదనం కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని అందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్, జడ్పీ సీఈఓ ఎం. శ్రీహరి కోరారు. శుక్రవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 'థీమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్‌పై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనూరాధ మాట్లాడుతూ భూమిని రక్షించుకోవాలంటే చెట్లను, నీటిని, సహజ వనరులను, పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డీఈడీ జి రమణ, కె. సుశీల, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి. ప్రసంగిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణా జిల్లా పొట్టిపాడు రైల్వే గేటు దగ్గర రైలు పట్టాలపై ఒక వృద్ధుడు మరణించినట్టు ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎంఎస్ఎన్ ప్రసాద్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు అదే గ్రామానికి చెందిన మజ్జి శ్రీను (62) రోజు వారీ కూలి పనులు చేస్తూ ఉంటాడని అతడు రైలు పట్టాలపై బహిర్భూమికి వెళ్లిన సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇద్దరు సోదరులపై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరుసకు కుమారులైన ఇద్దరు సోదరులు కుట్ర పన్ని ఒక వృద్ధుడికి మాయమాటలు చెప్పి అతడి ఇంటిని విక్రయించినట్టుగా సేల్‌డీడ్ రాయించుకుని మోసగించారని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఆ వృద్ధుడు ఫిర్యాదు చేశారు. ఏలూరు ఆర్‌ఆర్‌పేటలో నివాసం ఉంటున్న రిటైర్డ్ లెక్చరర్ దొమ్మేటి సత్యనారాయణ(74) వివాహం చేసుకోలేదు. ధనరాజ్ అనే యువకుడిని దత్తత తీసుకుని పెంచుకున్నాడు. అతడికి ఉన్న ఆస్తులన్నీ వీలునామా రాశాడు. ధనరాజుకు ఇద్దరు కుమారులు జన్మించారు. ఇంట్లో మనస్పర్థలు రావడంతో సత్యనారాయణ సోదరుల కుమారులైన దొమ్మేటి బాలమంగరావు, దొమ్మేటి సాయి ప్రభువులు కుట్ర పన్ని సత్యనారాయణను ఒక లాడ్జి రూములో ఉంచి ఆ తరువాత ఒక రూమ్ తీసుకుని ఉంచారు. ధనరాజ్ చంపడానికి ప్రయత్నిస్తున్నాడంటూ సత్యనారాయణకు భయం కలిగేలా బెదిరింపు మాటలు చెప్పారు. వారిద్దరూ సత్యనారాయణకు సంబంధించి బ్యాంక్ ఖాతాలు, చెక్కుబుక్కులపై సంతకాలు పెట్టించుకుని కొన్ని డాక్యుమెంట్లపై సేల్‌డీడీ రాయించుకున్నారు. ఆర్‌ఆర్‌పేటలో ఉన్న రూ.65లక్షల ఇంటిని వారిద్దరూ రాయించుకున్నారు. ఈవిషయం తెలుసుకుని వారిద్దరిపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ సీఐ కడియాల అశోక్‌కుమార్ తెలిపారు.

50 ధాన్యం బస్తాలు అపహరణ.. కేసు నమోదు

భీమడోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):పోలసానపల్లి జాతీయ రహదారిపై ఉంచిన ధాన్యం బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలసానపల్లి గ్రామానికి చెందిన కౌలురైతు మోర్ల విశ్వేశ్వరరావు తన పొలంలో పండించిన ధాన్యాన్ని బస్తాలలో నింపి హైవేపై ఉంచగా 13వ తేదీన రాత్రి మొత్తం 50 బస్తాల ధాన్యాన్ని గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

43.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కామవరపుకోట. నవంబరు 14(ఆంధ్రజ్యోతి):విజిలెన్స్, రెవెన్యూ అధికారులు గురువారం రాత్రి తడికలపూడిలో తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో అక్రమంగా వెళుతున్న 43.40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్సు అధికారి కె.నాగేశ్వరరావు తెలిపిన వివరాలివి.. తడికలపూడిలో ఓ వాహనాన్ని తనిఖీ చేయగా 43.40 క్వింటాళ్ల బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈడుపుగంటి శ్రీనివాసరావు, చోడిశెట్టి మహేష్, చోడిశెట్టి సతీష్, డ్రైవర్ ఒబిలిశెట్టి వెంకటసూర్యనారాయణలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

జంగారెడ్డిగూడెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఏడుగురికి రూ. పది వేలు చొప్పున కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ ఎస్ఐ కుటుంబరావు తెలిపారు. జంగారెడ్డిగూడెం కోర్టులో శుక్రవారం వారిని హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున జరిమానా విధించినందని ఎస్ఐ తెలిపారు.

అత్యాచారయత్నం.. యువకుడికి ఏడాది జైలు

ఏలూరు క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):ఓ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఒక యువకుడిపై నేరం రుజువు కావడంతో అతడికి ఏడాది జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చింతలపూడి పరిధిలోని చింతలపూడి మండలం వెంకటాపురానికి చెందిన కలపాల వేణు (34) మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి 2023 మే 15వ తేదీ రాత్రి అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. బాధితురాలు అవమానంగా భావించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలిని ఆసుపత్రిలో చేర్పించగా బాధితురాలి వాంగ్మూలం ప్రకారం చింతలపూడి ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేశారు. ఈ కేసులో తదుపరి ఎస్ఐ ప్రసాద్ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఐదో జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన కలపాల వేణుపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి మురళీకృష్ణ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ చింతమనేని రమేష్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు హెడ్‌కానిస్టేబుల్ ఎం.రాజేష్ సహకరించారు.



రైలులో గంజాయిని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

పది కేజీల గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్

భీమవరం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పూరి నుంచి తిరుపతి వెళ్లే పూరి ఎక్స్‌ప్రెస్‌లో ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో రైల్వే జీఆర్పీ సీఐ సోమరాజు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది కలిసి భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో రైలును తనిఖీ చేశారు. పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోతుండగా వారిని పట్టుకుని 4 బాక్సుల్లో ప్యాక్ చేసి ఉన్న సుమారు రూ. 5 లక్షల విలువైన పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని ప్రశ్నించగా ఒడిశా నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తున్నట్లుగా తెలిపారు. వారు ఒడిశాకు చెందిన మనూప్రధాన్, అరుణ్ ప్రధాన్, డ్రింక్ డిగాన్ అనే ముగ్గురిని అరెస్టు చేశామని, వారిని ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

పది గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లతో అధికారులు

తణుకు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షామియానా షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన సిలిండర్ల ఘటనపై శుక్రవారం రెవెన్యూ అధికారులు దాడి చేశారు. దాడిలో అక్రమంగా నిల్వచేసిన పది గ్యాస్ సిలెండర్లను తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, సిబ్బంది కలసి సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని మద్దుల సత్యవంతుడుపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వర్మ మాట్లాడుతకూ గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలెండర్లు, వ్యాపార అవసరాలకు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.





ఏలూరు జిల్లాలో బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

విద్యా సంస్థల బస్సులపై 36 కేసులు

- ఐదు లక్షల 15 వేల 400 రూపాయల జరిమానా

ఏలూరు క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా మోటారు వాహనాల తనిఖీ అధికారులు విద్యా సంస్థల బస్సులను తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన 36 బస్సులపై కేసులు నమోదు చేసి ఐదు లక్షల 14 వేల 400 రూపాయల అపరాధ రుసుము విధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీమ్ మాట్లాడుతూ అన్ని విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడపరాదని, డ్రైవింగ్ లైసెన్సు లేని వ్యక్తులు స్కూలు బస్సులు నడపరాదని అన్నారు. అటువంటి వారిని యజమాన్యాలు అనుమతించకూడదని, విద్యార్థులను సురక్షితంగా తీసుకువెళ్లాలని సూచించారు. విద్యార్థులను తరలించే విషయంలో నిబంధనలు పాటించని విద్యా సంస్థల బస్సులను, ప్రైవేటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

స్కూలు, కాలేజీ బస్సుల తనిఖీలు

ఏలూరు క్రైం : విద్యార్థుల భద్రతలో ఎలాంటి అజాగ్రత్తలు ఉపేక్షించేది లేదని జాయింట్ యాక్షన్ అధికారుల బృందం స్పష్టం చేసింది. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలపై ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో స్కూలు, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్‌పై సంయుక్త తనిఖీ అధికారుల బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. స్కూలు, కాలేజీ బస్సు డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలు తెలియజేశారు. ఫిట్‌నెస్ తప్పని సరిగా బస్సులకు ఉండాలని, టైర్లు, బ్రేకులు, హెడ్‌లైట్లు, ఎప్పటికప్పుడు తనిఖీ చేయించాలన్నారు. బృందంలో ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.స్వామి, జి.ప్రజ్ఞ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ మిల్లులపై విజిలెన్స్ దాడులు



ఆయిల్ మిల్లులు తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : జిల్లా విజిలెన్స్ ఎస్పీ కె. నాగేశ్వరరావు ఆదేశాల మేరకు తణుకు పట్టణంలోని మూడు ఆయిల్ మిల్లులపై విజిలెన్స్, ఆహార తనిఖీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. శ్రీనివాస ఆయిల్, ఫ్లోర్ మిల్, ఉమామహేశ్వర ఆయిల్ ఫ్లోర్ మిల్లు, లక్ష్మీ ఆయిల్ ఫ్లోర్ మిల్లులో తనిఖీలు చేపట్టారు. ఈ మూడు చోట్ల ఎటువంటి ఆహార భద్రత, లైసెన్సు, ప్యాకింగ్, ట్రేడ్ లైసెన్సులు లేనట్లు గుర్తించి వారిపై కేసులను నమోదు చేశారు. ఆయిల్ నమూనాలు సేకరించి విశ్లేషణ కోసం ల్యాబ్‌లకు పంపినట్టు విజిలెన్స్ ఎస్ఐ కె.సీతారామ్, ఆహార భద్రతాధికారి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

భీమవరం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):తమ కుమార్తె ఈ నెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. పట్టణానికి చెందిన ఒక బాలిక (15) ఒక హోటల్‌లో పని చేస్తూ ఉంటుంది. 13వ తేదీన పని నిమిత్తం హోటల్‌కు వెళ్లి సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో అన్నిచోట్లా వెతికి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

పెదపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం పెదపాడులో గ్రామసభ నిర్వహించి అనంతరం పల్లె నిద్ర చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు రక్షణ చట్టాలను తెలుసుకోవాలని, పోక్సో చట్టంపై అవగాహన ఉండాలన్నారు. వాతావరణ కాలుష్యానికి కారణమైన చికెన్ వేస్ట్ రవాణా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. ఏదైనా సమాచారం 94407 96635కు తెలపాలన్నారు. ఎస్ఐ కట్టా శారదానతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు ఆసుపత్రి అభివృద్ధికి పలు తీర్మానాలు

దెందులూరు,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో ముందుకు వెళ్తున్నామని దెందులూరు ప్రభుత్వ అభివృద్ధి కమిటీ చైర్మన్ కలపాల శ్రీహరి అన్నారు. శుక్రవారం దెందులూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు సుందరిబాబు ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో పలు తీర్మానాలు చేశారు. దెందులూరు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా విలీనం చేయాలని, 30 పడకల ఆసుపత్రిని 50 పడకలుగా మార్చు చేయాలని పలు తీర్మానాలు చేశారు. ఆసుపత్రి బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు

సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : చంటి

ఏలూరుటూటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి):సమస్యలు లేని ఏలూరు నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి, లబ్ధిదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఎక్కువగా ప్రభుత్వ గృహాలను అందించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందిస్తామన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

త్వరలో రైతు బజార్ నిర్మిస్తాం : ఎమ్మెల్యే రోషన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రెవెన్యూ అధికారులకు ఆదేశాలిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు, రైతులకు ఉపయోగపడే రైతుబజార్‌ను మార్కెట్ కమిటీ నిధులతో త్వరలోనే నిర్మిస్తామని చింతల పూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. రైతుబజార్‌కు మోక్షమెప్పుడు అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి యంత్రాంగం కదిలింది. శుక్రవారం చింతలపూడి ఏఎంసీ చైర్మన్ చీదరాల దుర్గా పార్వతి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్‌కె.ఎం.బాషాతో కలిసి ఆయన రైతుబజార్ స్థలాన్ని పరిశీలించారు. రైతు బజార్‌కు ఉన్న యాభై సెంట్ల స్థలాన్ని కొలిచి మార్కెట్ కమిటీకు అప్పగించాలని, ఆక్రమణలను తొలగించాలని డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌కు ఆదేశించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, జనసేన నాయకుడు చీదరాల మధుబాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

● కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో రైతులు పండించిన పత్తి పంటను క్వింటాకు రూ.8,110 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఆయన పర్యటించారు. స్థానిక గ్రంథాలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డు లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ ఏలూరు రోడ్డు మార్గంలో వెళ్లే ప్రజల కష్టాలు తీరను న్నా యన్నారు. హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకు చెందిన కాంట్రాక్టరుకు పెండింగ్‌లో ఉన్న రూ.23 కోట్ల ముప్పై మూడు లక్షల న్యూడెవలప్ మెంట్ బ్యాంకు (ఎన్‌డిబి) నిధులలో రూ.పది కోట్ల ముప్పై మూడు లక్షలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు.

'ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం బయ్యన్నగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రైతు నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంటను అమ్ముకోవాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు మద్దు బాలనాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ : బొరగం

కొయ్యలగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):ప్రజాసమస్యల పరిష్కారం కోసమే టీడీపీ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మార్కె ట్ యార్డు ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం నుంచి సమస్యలు తెలుసుకున్నారు. సీసీరోడ్లు, డ్రెయినేజీలు, కరెంటు సమస్యలు తదితర ప్రజాసమస్యలను ఆయన దృష్టికి వెళ్లాయి. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, కార్పొరేషన్ డైరెక్టర్లు పెండ్యాల రమా, అన్నపరాజు, టీడీపీ నాయకులు బొబ్బర రాజు, చాంధిని, ఆకుల అరుణ, సొసైటీ అధ్యక్షుడు బోసు, వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు

'రైతుల సంక్షేమమే సొసైటీ ధ్యేయం'

పెదవేగి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ తాతా సత్యనారాయణ అన్నారు. రైతుల పెట్టుబడి అవసరాలకు సంబంధించి రైతు నేస్తం పథకంలో రూ.1.20కోట్లు, పంట రుణాలు రూ.20లక్షలను సొసైటీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ సత్యనారాయణ.. రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు చెల్లించాల్సిన బకాయిలు రూ.9.50కోట్లు ఉండగా నెలరోజుల వ్యవధిలో రూ.4కోట్ల వరకు వసూలయ్యాయని, మిగిలిన రైతులు బకాయి చెల్లించి, కొత్త రుణాలు తీసుకోవాలని సూచించారు. సొసైటీ డైరెక్టర్ పోతురాజు రాటాలు, కార్యదర్శి ఆర్ఎస్వీప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

ఏలూరుటూటౌన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలివ్వాలని అన్నారు. ఆప్కాస్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరండర్ లీవ్‌లు, డీఏలు, ఇంక్రిమెంట్లు, యూనిఫాం ఇవ్వాలన్నారు. పారిశుధ్య విభాగంలో 750 మంది చేయాల్సిన పనులను 450 మందితో చేయిస్తున్నారన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు యు.వెంకటేశ్వరరావు, వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ నాయకులు శ్రీనివాసరావు, నెహ్రూబాబు, ఎల్.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని భవనంలో తరగతులా ?

▸▸ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుల ఆందోళన

ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):అనుమతిలేని భవనంలో హైస్కూలు తరగతులు నిర్వహిస్తుండడం, కళాశాలకు ఆలస్యంగావచ్చిన ఇంటర్మీడియట్ విద్యార్థులను బూతులతో డీన్ దూషిస్తున్నారనే ఆరోపణలతో శుక్రవారం స్థానిక ఎన్ఆర్ పేటలోని ఓ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆందోళనకు దిగారు. వివరాలను సంఘ జిల్లా కార్యదర్శి లెనిన్ మీడియాకు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కావాల్సిన ఇంటర్ తరగతులను గంట ముందుగానే ప్రారంభిస్తున్నారని, విద్యార్థులు కొన్ని నిమిషాలు ఆలస్యమైనా కళాశాల డీన్ బూతులు తిడుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖనుంచి అనుమతి తీసుకోకుండా హైస్కూలు తరగతులను జూనియర్ కళాశాల భవనంలో ఏడాది కాలంగా నిర్వహిస్తుండడంపై డీవైఈవో, ఎంఈవోలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వీటిపై ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆర్ఐవో యోహాన్‌ను వివరణ కోరగా... సదరు విద్యాసంస్థ ప్రతినిధులతో చర్చించామన్నారు. భవన నిర్మాణపనులు పురోగతిలో ఉన్నందున తాత్కాలికంగా హైస్కూలు తరగతులను ఇక్కడ నిర్వహిస్తున్నామని, శనివారం సాయంత్రానికి నూతన భవనంలోకి మారుస్తామని అంగీకరించారని ఆర్ఐవో వివరించారు. విద్యార్థులను దూషించడంపై కళాశాల డీన్ అందుబాటులో లేనందున మాట్లాడలేకపోయామని, సోమవారానికి ఈ సమస్యల ను పరిష్కరిస్తామని తెలిపారు.

ట్రాక్టర్ గడ్డి రూ.పది వేలు !

(5వ పేజీ తరువాయి)


చాట్రాయిలో ట్రాక్ మిషన్‌తో వరికోత

ఆరు నెలలు భూములు ఖాళీగా ఉండడంతో అప్పట్లో పశువులు తిరగడానికి ఇబ్బంది ఉండేది కాదు. బోరు బావులు వచ్చిన తర్వాత ఖరీఫ్, రబీ పంటల సాగుతో ఏడాది మొత్తం భూముల్లో పంటలు ఉంటు న్నాయి. పశువులు తిరగడానికి చోటు కరువు అయ్యింది. పాడి మీద వచ్చే ఆదాయం కంటే పశువుల పోషణకు అధికంగా ఖర్చు అవుతోందని పశుపోషకులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామాల్లోను పశువులు కనుమరుగవుతాయని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఏలూరు-శనివారపుపేట హాస్టల్‌లో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్


ఏలూరులో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


భోజనం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ఘనంగా బాలల దినోత్సవం

ఏలూరు క్రైం/ఏలూరు రూరల్/ఏలూరు కార్పొరేషన్/ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.దేశ మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకుని చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరు శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో బాలల దినోత్సవ వేడుకలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. బాలలకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, సీడబ్ల్యూసీ సభ్యులు రాజేశ్వరరావు, హైమ పాల్గొన్నారు. అనంతరం దొండపాడులోని పరివర్తన బధిరుల పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఏలూరు మండలం చాటపర్రులో శ్రీమమత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుడివాకలంక మండ పరిషత్తు మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులు హెచ్ఎం నంబూరి రాంబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏలూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. మిఠాయిలు

▸▸ నెహ్రూ చిత్రపటాలకు నివాళులు

పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రతాప సుబ్ర హ్మణ్యశర్మ, దండుబోయిన చంద్రశేఖర్ తదిత రులు పాల్గొన్నారు. ఏలూరు నగరంలోని సంతోషినగర్ శర్వాణి స్కూలులో బాలల ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్కూలు హెచ్ఎం సత్యశారద, డైరెక్టర్ మదనమోహనరాజు పాల్గొన్నారు.

● దెందులూరు/టి.నరసాపురం/భీమడోలు/లింగపాలెం :దెందులూరు మండలం కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గారపాటి హైమవతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. టి.నరసాపురం మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహిం చారు. హెచ్ఎం బీఎల్ స్వామి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. లింగపాలెం మండలం సింగగూడెం పాఠశాలలో ఎంఈఓ-2రవీంద్ర ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. పలువురు విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో అలరించారు.

మెరుగైన విద్యా ప్రమాణాలు అందిస్తున్నాం : చింతమనేని

ఏలూరు రూరల్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి) : 'యువనాయకుడు, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యా వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేస్తున్నాం. సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్నపు భోజన పథకం, తల్లికి వందనం సహా పలు కార్యక్రమాలతో విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలను అందిస్తున్నాం' అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చాటపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెహ్రూ చిత్రపటానికి నివాళుల ర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. రిటైర్డ్ డ్రిల్ మాస్టర్ దివంగత వంకినేని వెంకట రామచంద్రరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.4 లక్షలు రూపాయలతో నిర్మించిన నూతన భోజనాల షెడ్డును దాత కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు.

పెట్రోల్ బంకు సిబ్బందికి యూనిఫాం అందజేత



యూనిఫామ్ అందిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): పోలీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నడపబడుతున్న పెట్రోలు బంకుల్లో పనిచేసే సిబ్బందికి యూని ఫాంలను ఎస్పీ కిశోర్ అందించారు. ఏలూరు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పెట్రోల్ బంకు సిబ్బందికి ఎస్పీ యూనిఫామ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందించినటువంటి ఉద్యోగులను ప్రోత్సాహకాలతో సత్కరిస్తామని హామీ ఇచ్చారు. సతీష్, ఎస్ఐ రవీంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు

దివ్యాంగుల నిర్ధారణకు వైద్యశిబిరాల సవరణ షెడ్యూలు

ఏలూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా దివ్యాంగులను నిర్ధారించేందుకు నిర్వహించే వైద్యశిబిరాలు, తేదీలతో కూడిన షెడ్యూలును సవరిస్తూ సమగ్రశిక్షా అభియాన్ జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. తొలుత విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం స్క్రీనింగ్ క్యాంపులు ఈనెల 18నుంచి ప్రారంభంకావాల్సి ఉండగా, తాజాగా ప్రకటన మేరకు ఈనెల 22నుంచి నియోజకవర్గానికి ఒకరోజు వంతున 28వ తేదీ వరకు రోజూ వైద్యశిబిరం ఉండేలా షెడ్యూలును సవరించినట్టు ఏపీసీ వివరించారు. ఈనెల 22న పోలవరం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు బుట్టాయగూడెం జడ్పీ హైస్కూలు, 23న చింతలపూడి నియోజకవర్గ మండలాలకు చింతలపూడిలోని జడ్పీ హైస్కూలు, 24న కైకలూరు నియోజకవర్గ మండలాలకు కైకలూరులోని భవిత కేంద్రం, 25న ఉంగుటూరు నియోజకవర్గ మండలాలకు ఉంగుటూరులోని జడ్పీ హైస్కూలులో వైద్యశిబిరాలు జరుగుతాయి. 26న నూజివీడు నియోజకవర్గ మండలాలకు నూజివీడులోని ఎస్ఆర్ఆర్ జడ్పీ హైస్కూలు, 27న దెందులూరు నియోజకవర్గ మండలాలకు దెందులూరులోని జడ్పీ హైస్కూలు, 28న ఏలూరు నియోజకవర్గ మండలాలకు ఏలూరులోని అశోకవర్ధన మున్సిపల్ పాఠశాలలోని భవిత కేంద్రంలో వైద్యశిబిరాలు జరుగుతాయని ఏపీసీ వివరించారు.

టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా మనోహర్



ఏలూరుటూటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఏలూరు నగర టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా తంగేటి మనోహర్ నియమితులయ్యారు. తనను బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే బడేటి చంటికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గ సమస్యలపై పోరాటాలు కొనసాగించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. .

'ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకే తరలించాలి'

చింతలపూడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులందరూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకే తరలించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ పాషా అన్నారు. మండలంలోని మల్లాయిగూడెం, రాఘవాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్న కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 24 గంటల్లో ఈ రైతులందరికీ సొమ్ము జమ అయిందన్నారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాల్లో రైతులు, సిబ్బందితోనూ మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ∩

జర్నలిస్టుల అక్రిడిటేషన్‌కు దరఖాస్తులు

ఏలూరుసిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర, జిల్లా స్థాయిలలో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండేళ్ల (2026-27) కాలపరిమితికి సమాచార, పౌరసంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్‌లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖాధికారి యు.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల పాత్రికేయుల దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామన్నారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ ఏడాది నవంబరు 30వతేదీ నాటికి ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. దరఖాస్తుల నమోదుకు ముందుగా మీడియా సంస్థల వివరాలు పోర్టల్‌లో పొందుపరచాల్సి ఉన్నందున సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్‌డ్రైవ్‌లో పొందుపరచి, జిరాక్స్ కాపీలను డైరెక్టర్ వారి కార్యాలయం, సమాచార, పౌరసంబంధాల శాఖ, పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, రెండో అంతస్తులోని విజయవాడ కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం పాత్రికేయులు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ https://mediarelations.ap.gov.inలో సూచిం చిన విధంగా వివరాలను నమోదు చేయాలన్నారు.





ఏలూరులో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ.. రమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న కాలేజీ ప్రతినిధులు

గ్రంథాలయాలు అభినవ దేవాలయాలు

▸▸ జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ఏలూరుటూటౌన్/ఏలూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు అభినవ దేవాలయాలని జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ప్రారంభించారు. తొలుత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన గ్రంథాలయం నిర్మించేందుకు కృషిచేస్తానన్నారు. అనంతరం కళారత్న పార్వతి రామచంద్రన్ కళాబృందం చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. వయోజన విద్యా ఏపీవో ఆర్.విజయ్‌కుమార్, ఉపసంచాలకులు సీహెచ్.ప్రభాకర్, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా మహిళా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను గాంధీ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం సునీత జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. బాలల గ్రంథాలయంలో కస్తూరిబా ఉన్నత పాఠశాల హెచ్ఎం కే.మాధవిలత, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కే.రమేశ్‌బాబులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీఆర్ఆర్ పీజీ కళాశాలలో జిల్లా ఉపాధికల్పన అధికారి డాక్టర్ పి.వి.రమేష్‌కుమార్ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. రమేష్‌కుమార్‌ను కళాశాల కరస్పాండెంట్లు విష్ణుమోహన్, శ్రీనివాసరావు, పీజీ డైరెక్టర్ యలమర్తి బాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్ సత్కరించారు.

●చింతలపూడి/భీమడోలు/పెదపాడు/ద్వారకాతిరుమల/టి.నరసాపురం/పెదవేగి/కామవరపుకోట : చింతలపూడి గ్రంథాలయ వారోత్స వాల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. విద్యార్థులు, పాఠకుల మధ్య కూర్చొని సందడి చేశారు. ఏఎంసీ చైర్మన్ చీదరాల దుర్గాపార్వతి తదితరులు పాల్గొన్నారు. భీమడోలు మండలం భీమడోలు శాఖ గ్రంథాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజు గ్రంథాలయ వారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలువురు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. పెదపాడు మండలం పెదపాడు శాఖ గ్రంథాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తా అనిల్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల శాఖ గ్రంథాలయంలో సర్పంచ్ కుంటం స్వర్ణలత ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. టి.నరసాపురం శాఖ గ్రంథాలయంలో ఎంఈవో ఎస్.కళ్యాణి ఆధ్వర్యంలో, పెదవేగి శాఖ గ్రంథాలయంలో సొసైటీ చైర్‌పర్సన్ తాతా సత్యనారాయణ ఆధ్వర్యంలో, కామవరపుకోట శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు తోట అరుణకుమార్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ షేక్ ఇబ్రహీం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

'చింతలపూడి' నుంచి మాక్ అసెంబ్లీకి 'వంశిక' ఎంపిక


విద్యార్థిని వంశిక

లింగపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో అధ్యక్షా అంటూ మాట్లాడే అవకాశం చింతలపూడి నియోజకవర్గానికి లింగపాలెం మండలం వేములపల్లి విద్యార్థినికి దక్కింది. ఈనెల 26న భారతరాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుతో మాక్ అసెంబ్లీ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీలలో విజేతగా రంగాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కె.వంశిక ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటరత్నం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 రవీంద్ర, హెచ్ఎం వెంకటరత్నం మాట్లాడుతూ విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని విద్యార్థి దశ నుంచే చట్టసభలపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. విద్యార్థిని వంశిక మాట్లాడుతూ అసెంబ్లీలో మాట్లాడేందుకు అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. ఈ సదర్భంగా ఆమెను ఎంఈవో-2 రవీంద్ర, హెచ్ఎం, పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కొయ్యలగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గంగవరం ఊరు చివరిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలిసింది. ఈ సందర్భంగా ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.23,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కుక్కునూరు కాలేజీలో క్షుద్రపూజలు !


క్షుద్రపూజలు ఆనవాళ్లను పరిశీలిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కుక్కునూరు, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి) : కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో క్షుద్ర పూజలు నిర్వహించిన ఆనవాళ్లు కనపడ్డాయి. శుక్రవారం ఉదయం కళాశాలకు వచ్చిన విద్యార్థులు అవి చూసి భయాందోళనకు గురయ్యారు. ఆ కళాశాల పక్కనే ఉన్న ప్రదేశంలో ముగ్గు వేసి, పసుపు, కుంకుమ, తల వెంట్రుకలు, మెడ కోసిన కోళ్లను చూసిన విద్యార్థులు భయపడ్డారు. కళాశాల అధ్యాపక బృందం పరిశీలించారు. కళాశాలకు ప్రహరీ లేకపోవడం వల్ల కాలేజీ ఆవరణలోనే ఈ పనులకు పాల్పడ్డారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రేపు సహ చట్టంపై అవగాహన కార్యక్రమం

ఏలూరు,నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 16న ఏలూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటలకు సమాచార హక్కుచట్టంపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్టు టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కమ్మ శివరామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి ఐనాల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు యూఎన్‌వీ సత్యనారాయణ పాల్గొంటారన్నారు.

పుస్తకావిష్కరణ, సదస్సులు జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అమరుడు చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా హైదరాబాదులో ఈనెల 19న పుస్తకావిష్కరణ అనంతరం జరిగే సదస్సులను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కారం రాఘవ పిలుపు నిచ్చారు. పుల్లారెడ్డి రచించిన రచనలను న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పుస్తకావిష్కరణ రూపంలో తీసుకువస్తుందని తెలిపారు. శుక్రవారం బుట్టాయగూడెం కార్యాలయంలో సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. విప్లవకారుల అనేక పోరాటాలు చేశారని వాటి ఫలితాలను ఏజెన్సీ ప్రాంతంలో నేటికీ ఆదివాసీలు అనుభవిస్తున్నారని తెలిపారు. కేవీ రమణ, ఈ.భూషణం, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బుట్టాయగూడెం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని పీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మొడియం నాగమణి తెలిపారు. శుక్రవారం ఈ మేరకు మండలంలోని అన్ని సచివాలయాల వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపి సచివాలయం ఉద్యోగులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారని ఆ కారణం చూపిస్తూ సెంటర్లను విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలను తప్పుబట్టారు. అంగనవాడీ ప్రిస్కూల్ బలోపేతం కావాలంటే 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు ఉండాలని, రాష్ట్రవ్యాప్తంగా అంగనవాడీ కేంద్రాల్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ నాయకులు కె.పుష్ప, నాగరత్నం, టి.రామలక్ష్మి, రామాయమ్మ, సీత, జ్యోతి, సుధా, కృపామణి, నూర్జహాన్, ఆకాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

కైకరం షష్టి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

నిడమర్రు, నవంబరు14(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో వున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశానికి ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అధ్యక్షత వహించారు. సమావేశంలో కోర్టు ఉత్తర్వులు, పూర్వం జరిగిన వివరాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఇరు వర్గాలకు హామీ ఇచ్చారు. సమావేశానికి దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కూచపూడి శ్రీనివాస్, నిడమర్రు సీఐ నక్కా రజనీకుమార్, తహసీల్దార్ వై.పూర్ణచంద్రప్రసాదరావు, చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగిని దురుసుతనంపై భక్తురాలి ఫిర్యాదు

ద్వారకాతిరుమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓ కాలినడక భక్తురాలిపై శ్రీవారి దేవస్థానం డార్మెటరీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని దురుసుగా ప్రవర్తించింది. బాధిత భక్తురాలు ఫిర్యాదు పుస్తకంలో ఆమెపై ఫిర్యాదు చేశారు. వివరాలివి.. తణుకుకు చెందిన పి.గీత, స్నేహితులు, తన ఇద్దరు పిల్లలతో కలిసి కాలినడకన ద్వారకాతిరుమలకు చేరుకుని కేశఖండన శాల వద్ద నున్న డార్మెటరీకి వెళ్లి అక్కడున్న ఉద్యోగినితో రూము కోసం అడిగారు. భోజనానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్తున్న భక్తురాలిపై ఆమె దురుసుగా సమాధానం చెప్పడంతో పాటు చోటు లేదని చెప్పింది. ఇద్దరికి వాగ్వివాదం జరిగింది. విషయాన్ని ఫిర్యాదు పుస్తకంలో రాసింది.

పబ్లిక్ ప్రకటన

లెటర్ తేది : 14-11-2025

ఇందుమూలముగా గ్రామ ప్రజలకు, భక్తులకు తెలియజేయునది ఏమనగా, ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, ఊటసముద్రం గ్రామంలో యున్న శ్రీ రామాలయం వారి దేవస్థానంను హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోనికి చేర్చి, చట్టం 30/87 సందలి సెక్షన్ 43 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయుట మరియు సెక్షన్ 6 ప్రకారం పబ్లికేషన్ చేయుటకు గాను నిర్ణయించుట జరిగినది. కావున యందు విషయమై మీకు ఏమైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ఇచ్చిన తేది నుండి పది రోజుల్లో లిఖిత పూర్వకముగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ ఆఫీసర్, దేవదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు వారికి అందజేయవలెను.

సం/- ప్రస్తుత మేనేజింగ్ ట్రస్టీ,
శ్రీ రామాలయం వారి దేవస్థానం,
ఊటసముద్రం గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా.

దేవదాయ - ధర్మదాయ శాఖ
భూములు కౌలుకు టెండర్ మరియు బహిరంగ వేలం పాట ప్రకటన

ఏలూరు జిల్లా, నిడమర్రు మండలం, నిడమర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రాజేశ్వర స్వామి వారి దేవస్థానము యొక్క చేపల చెరువు నందు చేపలు పెంచుకొనుటకు లైసెన్స్ హక్కు కొరకు ది.27-11-2025 తేది ఉదయం గం.11.00లకు శ్రీ స్వామి వారి సందు ది.01-01-2026 తేది నుండి 31-12-2028 తేది వరకు (అనగా 3సం.ములు) కౌలు హక్కు పొందుటకు గాను శ్రీ తనిఖీదారు, దేవదాయ శాఖ, తాడేపల్లిగూడెం వారి సమక్షమున కార్యనిర్వహణాధికారిచే బహిరంగవేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

కౌలు భూమి షెడ్యూల్

క్ర.సెం	వేలం వివరము	సర్వే.నెం.	యం.సెం.	భూమి ఉన్న గ్రామం	ధరవత్తు
1	శ్రీ రాజేశ్వర స్వామి దేవస్థానం, నిడమర్రు	287	6.56	నిడమర్రు	రూ. 30,000/-

ముఖ్యమైన పాట షరతులు :- 1) ఈ వేలం జి.ఓ.నెం.426 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంట్ తేది.09.11.2015 సందలి నిబంధనలను అనుసరించి హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి ఆలయ కార్యనిర్వహణాధికారిచే జరుపబడుచున్నది. 2) పై జి.ఓ. నిబంధనలను అనుసరించి హెచ్చుపాటదారుడు ప్రతి సం.ము యకరా 1.కి మొదటి సం.ము మక్తాపై, 2వ సం.మునకు 10% పెంపుదల, 3వ సం.మునకు 2వ సం.ము మక్తాపై 10% పెంపుదల చేయుచూ చెల్లించు నిర్ణయం. 3) దేవస్థానమునకు ఏవిధమైన బకాయిలు ఉన్నవారు గానీ దేవస్థానముతో ఎట్టి లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు. 4) హెచ్చుపాటదారుడు 1 సం.కౌలు శిస్తు సొమ్మును పాట పాడిన వెంటనే (ముందుగా) అడ్వాన్స్‌గా కట్టవలెను. దీనికి వడ్డీ ఇవ్వబడదు. మిగిలిన పాట షరతులు కార్యాలయము పనివేళలలో అడిగి తెలుసుకొనవలెను. లేదా పాట జరుగు సమయంలో చదివి వినిపించబడును.

ఇట్లు
నిడమర్రు, తేది : 13-11-2025
కార్యనిర్వహణాధికారి, సెల్ : 96764 08813

17న యాదవ కార్తీక వనసమారాధన

కైకలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ శ్రీకృష్ణయాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు కరేటి శ్రీహరి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో వనసమారాధన నిర్వహిస్తామని కార్యక్రమంలో సంఘ ప్రముఖులు పాల్గొంటారని నియోజకవర్గంలోని యాదవ సంఘీయులంతా పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
కైకలూరు, నూజివీడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కైకలూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కైకలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కైకలూరు, ఆచవరం, వింజరం, శ్యామలాంబపురం, గోపవరం, రాచపట్నం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జిబి శ్రీనివాసరావు తెలిపారు. అలాగే వరహా పట్నం 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బాలలు విధిగా పాఠశాలకు వెళ్లాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి అనూష

నూజివీడు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలు విధిగా పాఠశాలకు వెళ్లాలని విద్యా హక్కు చట్టం నిర్దేశించినట్లు నూజివీడు ఒకటో అదనపు జూనియర్ జడ్జి ఓ అనూష అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నూజివీడు కాలనీ ఎంపీపీ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యా హక్కు చట్టం, బాల కార్మిక నిరోధక చట్టంపై వివరించారు. నెహ్రూ జీవిత విశేషాలను వివరించారు. న్యాయవాదులు ఎస్‌కేడీ ప్రసాద్, గోపినాథ్, హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న న్యాయమూర్తి లక్ష్మి

కైకలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులకు భంగం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా కైకలూరు మాతా ఇంగ్లీషు మీడియం స్కూల్లో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. బాలలు హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే నేరంగా పరిగణిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. న్యాయవాదులు పవన్‌కాంత్, డి. శివప్రసాద్, స్కూల్ హెచ్‌ఎం థామస్, ఏఎస్సై పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి : కామినేని



మదినేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం అమ్మకాలు, గిట్టుబాటు ధర విషయంలో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బొమ్మినంపాడులో పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ట్రాక్టర్‌ను నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు సడలించి గంటల వ్యవధిలోనే సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏడీఏ వెంకటమణి, సర్పంచ్ దారం సుధ, ఏవో వేణుమాధవ్, డీసీఎంఎస్ మండల ఇన్‌చార్జ్ విజయ్, టీడీపీ నాయకులు బొప్పన సుందర రామయ్య, యర్రా రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే కృష్ణామిల్క్ లక్ష్యం

చాట్రాయి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా కృష్ణామిల్క్ యూనియన్ అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అన్నారు. కొత్తగూడెం పాల సహకార సంఘం సభ్యురాలు చల్లగుళ్ళ వెంకట రంగమ్మ కుమారుడి వివాహం సందర్భంగా కల్యాణమస్తు పథకం కింద రూ. 20 వేలు విలువైన బంగారు నాణేన్ని శుక్రవారం అందజేశారు. తిరువూరు క్లస్టర్ మేనేజర్ దిలీప్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్, సంఘం అధ్యక్షురాలు మల్లెంపల్లి గంగారత్నం పాల్గొన్నారు.



షష్టి ఉత్సవాలు విజయవంతం చేయాలి: కామినేని

ముదినేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి షష్టి కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లపై ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అధ్యక్షతన శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో కామినేని మాట్లాడుతూ ఉత్సవాల భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణలో అధికారులు సమష్టిగా వ్యవహరించాలని, పటిష్టమైన క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాట్లపై ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి వివరించి, అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. తహసీల్దార్ లతీఫ్ పాషా, ఎంపీడీవో రామకృష్ణ, కైకలూరు సీఐ రవికుమార్, ఎస్‌ఐ వీరభద్రరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు



కలిదిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో మూల్లంక - పెదలంక రహదారి ధ్వంసమవటంతో కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు శుక్రవారం చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో రహదారిపై గోతులను చదును చేసి మెటల్‌తో పూడ్చుతున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా మూల్లంక నుంచి రామకృష్ణపురం వరకు 3 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు చేస్తున్నామని రైతులు తెలిపారు. మూల్లంక - పెదలంక రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని అధికారులు త్వరతగతిన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. డీసీ ఛైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఎత్తిపోతల కమిటీ ఛైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు, మాజీ ఎంపీపీ బండి తులసీరావు, నాయకులు బోళ్ల ఏడుకొండలు, తంగెళ్ల గణపతి, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపారాధన

మండవల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండవల్లి గ్రామంలో కొలువైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు భవానీ శంకర్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో శివలింగం, ఓంకారం, త్రిశూలం, స్వస్తిక్, పలు ఆకృతిలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



నూజివీడులో నెహ్రూకు నివాళులు



చింతలవల్లిలో అంగన్వాడీ కేంద్రంలో..



అయ్యవారిరుద్రవరం పాఠశాలలో



గురజ హైస్కూలు విద్యార్థులకు బహుమతులు

ఘనంగా బాలల దినోత్సవం

▸ పండిత నెహ్రూకు ఘన నివాళి ▸ చిన్నారులకు పోటీలు

నూజివీడు టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారత ప్రథమ ప్రధాని, జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చెన్న రాఘవేంద్రనాథ్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. నూజివీడు త్రివిధ పాఠశాల, కుమార్ పబ్లిక్ స్కూల్, ముద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

కైకలూరు: కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ పి దీప్తి ఆధ్వర్యంలో వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రాజబాబు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యార్థి దశలో బాలలు విద్యపట్లే ఆసక్తి చూపాలని అప్పుడే ఉన్నత పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ సందర్భంగా దేశనాయకుల వేషధారణలో చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ వై. శ్రీలత, ఎంఈఓ వి శ్రీనివాసరావు, ఏఎస్సై పూర్ణచంద్రరరావు, ఏలూరు డీసీఐ పి జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నెహ్రూ చిత్రపటానికి చిన్నారులు, అంగన్‌వాడీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ వేషధారణలతో చిన్నారు అలరించారు. హెచ్‌ఎం రవీంద్ర మాట్లాడుతూ నెహ్రూను పిల్లలు చాచా నెహ్రూ అని పిలిచేవారని న్నారు. దేశానికి నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు.

ముదినేపల్లి: మండలంలోని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి శాఖా గ్రంథాయంలో గ్రంథాలయాధికారిణి ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. గురజ హైస్కూలు, చిన పాలపర్రు ఎలిమెంటరీ స్కూలులో హెచ్‌ఎంలు సునీత, ప్రసన్న కుమారి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కలిదిండి: కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు పండిత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం స్వర్ణకుమారి పాల్గొన్నారు.

మండవల్లి: అయ్యవారిరుద్రవరం ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని నెహ్రూకు ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు హెచ్‌ఎం సీహెచ్. పిచ్చేడు బహుమతులు అందజేశారు.



చనుబండలో గ్రంథాలయ వారోత్సవాలు



కైకలూరులో మాట్లాడుతున్న వక్తలు



గోపవరంలో చిత్రలేఖనం పోటీలు



ఆగిరిపల్లిలో నెహ్రూకు అధికారుల నివాళి

గ్రంథాలయాలతో విజ్ఞానం

▸ వారోత్సవాల్లో వక్తలు ▸ నెహ్రూ, అయ్యంకి రమణయ్యకు నివాళి

చాట్రాయి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వీటిని విద్యార్థులు, యువత ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు కోరారు. చనుబండ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం, బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మోరంపూడి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉందని అందరూ సద్వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు నక్కా రాము, చీదిరాల మారేశ్వరరావు, నెక్కలపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో హెచ్‌ఎం గంపా వెంకట్రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరుగు, మ్యూజికల్ ఛైర్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సేవల పెంపునకు చర్యలు: కామినేని

ముదినేపల్లి: ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేయడం ద్వారా గ్రామీణ గ్రంథాలయాల సేవలను మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయాల్లో శుక్రవారం ఆయన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయంలో కంప్యూటర్లను ప్రారంభించారు. కూటమి నాయకులు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, కోటప్రోలు కృష్ణారావు, బొంగురవి కుమార్, మోటేపల్లి హనుమ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, గ్రంథాలయాధికారిణి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: గ్రంథాలయాల్లో యువత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శుక్రవారం కైకలూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తాయని నేటి యువత సెల్‌ఫోన్ వ్యామోహంలో పుస్తకపఠనాన్ని మర్చిపోతున్నారన్నారు. పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని సూచించారు. సర్పంచ్ కేవీఎస్‌ఎం నాయుడు, సాహితీ మిత్రుల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకటనారాయణ, బీజేపీ నాయకులు కీర్తి వెంకటరాంప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, కల్యాణి, గ్రంథాలయాధికారి ఎ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, చాచా నెహ్రూ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ రామకృష్ణ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు పద్యాలపై పోటీలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, సర్పంచ్ మారుతీ ప్రసన్న, గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. కోరుకొల్లు గ్రంథాలయంలో సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు.

ముసునూరు: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు కొప్పుల బాబురావు, టి.ప్రసాద్‌లు అన్నారు. గోపవరం గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యంకి వెంకట రమణయ్య, జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు గ్రంథాలయ అధికారి సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు గోధుమ రవికుమార్, క్రాంతి కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవం మండల విద్యాశాఖ అధికారి-2 ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించి, పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఈజీ ఎస్‌వి కుమార్, ఎంపీపీ మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మక్కే వేణుగోపాలరావు, ఉపాధ్యాయని పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



నూజివీడులో బస్సు తనిఖీచేస్తున్న ఏఎంవీఐ

విద్యా సంస్థల బస్సులపై 36 కేసులు

▸ రూ. 5.15 లక్షల జరిమానా

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా మోటారు వాహనాల తనిఖీ అధికారులు విద్యా సంస్థల బస్సులను తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన 36 బస్సులపై కేసులు నమోదు చేసి ఐదు లక్షల 14 వేల 400 రూపాయల అపరాధ రుసుము విధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీమ్ మాట్లాడుతూ అన్ని విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా నడపరాదని, డ్రైవింగ్ లైసెన్సు లేని వ్యక్తులు స్కూలు బస్సులు నడపరాదని అన్నారు. విద్యార్థులను తరలించే విషయంలో నిబంధనలు పాటించని విద్యా సంస్థల బస్సులను, ప్రైవేటు వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

స్కూలు, కాలేజీ బస్సుల తనిఖీలు

విద్యార్థుల భద్రతలో ఎలాంటి అజాగ్రత్తలు ఉపేక్షించేది లేదని జాయింట్ యాక్షన్ అధికారుల బృందం స్పష్టం చేసింది. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలపై ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో స్కూలు, కాలేజీ బస్సుల ఫిట్‌నెస్‌పై సంయుక్త తనిఖీ అధికారుల బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. స్కూలు, కాలేజీ బస్సు డ్రైవర్‌లకు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలియజేశారు. ఫిట్‌నెస్ తప్పనిసరిగా బస్సులకు ఉండాలని, టైర్లు, బ్రేకులు, హెడ్‌లైట్లు, ఎప్పటికప్పుడు తనిఖీ చేయించాలన్నారు. ఈ బృందంలో ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, ఎంవీఐ జి.ప్రసాదరావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.స్వామి, జి.ప్రజ్ఞ, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు నియోజకవర్గంలో...

నూజివీడు: నియోజకవర్గంలో ఏఎంవీఐలు కృష్ణవేణి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో నూజివీడు, చాట్రాయి మండలాల్లో వాహన తనిఖీలను నిర్వహించారు. సరైన అనుమతి పత్రాలు లేని కారణంగా 15 వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు రెండు పాఠశాలల బస్సులకు సంబంధించి టాక్సులు సక్రమంగా లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు వారు తెలిపారు.



కైకలూరులో జరిగిన బీజేపీ విజయోత్సవ సంబరాల్లో కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కామినేని



నూజివీడులో బీజేపీ శ్రేణుల సంబరాలు

బీజేపీ విజయోత్సవాలు

కైకలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ అన్ని రాష్ట్రాల్లో విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బీహార్‌లో బీజేపీ మరలా అధికారాన్ని చేజిక్కించుకోవడం పట్ల విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కామినేని స్వీట్లు పంపిణీ చేశారు. నరేంద్రమోడీ ప్రధాని అయిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు గుర్తింపు, గౌరవం దక్కిందన్నారు. 195 దేశాల్లో భారత్ 4వ స్థానానికి చేరిందన్నారు. దేశ అభివృద్ధితోనే ప్రజలు అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మోడీ నాయకత్వంలో భారత్ విశ్వగురువుగా ఎదుగుతుందని, బీహార్ ఎన్నికల్లో ఊహించినదానికంటే ప్రజలు ఎక్కువ సీట్లు పట్టం కట్టారని దీంతో విజయోత్సవ సంబంరాలు దేశావ్యప్తంగా జరుగుతున్నాయన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, బీజేపీ నాయకులు కీర్తి వెంకటరాంప్రసాద్, చెరుకువాడ బలరామరాజు, పైడిపాటి శివశంకర్, చిట్టూరి రవీంద్ర, బోయిడి సురేష్, బోడావుల జగదీష్, పేటేటి సత్యనారాయణ, గరికిపాటి రాంబాబు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో ప్రధాని మోదీ నాయకత్వంలో కూటమి అఖండ విజయాన్ని సాధించడం పట్ల నూజివీడు బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. శుక్రవారం సాయంత్రం స్థానిక చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఓటు చోరీ అని అసత్య ప్రచారంతో రాజకీయ లబ్ధి పొందాలని చూసిన మహా కూటమికి ప్రజల మనసులని చోరీ చేసి నరేంద్రమోదీ గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. సంబరాలలో సీనియర్ నాయకులు వైఎస్ దొరై, ఎం రాజశేఖర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బోసు అప్పారావు, శివరాజు, వసుంధరదేవి, జిల్లా కోశాధికారి, కూటమి సమన్వయకర్త మాటూరి రవికాంత్, కొండయ్య సత్రం ఛైర్మన్ మాటూరి ప్రసాద్, పార్టీ పట్టణ బీజేపీ ఇంచార్జ్ దొడ్డా నాగరాజు, ముసునూరు మండల అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించకుంటే పట్టా రద్దు

కలిదిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై 2.0 ఇళ్ల మంజూరుపై శుక్రవారం కలిదిండిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇంటి స్థలం కలిగిన లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణం చేపట్టకపోతే ఇంటి స్థలం పట్టా రద్దు అవుతుందన్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. హౌసింగ్ ఏఈఈ నాగబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నెహ్రూకు కాంగ్రెస్ నాయకుల నివాళి

నూజివీడు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పండిత జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని నూజివీడులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కార్లు స్టాండ్ వద్ద నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీసీసీ మాజీ కార్యదర్శి బీడీ రవికుమార్ మాట్లాడుతూ నెహ్రూ నిర్మించిన ప్రాజెక్టులే నేటికి దేశానికి వెన్నుముక అని అన్నారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పరిమి సాగర్‌కుమార్, జిల్లా కార్యదర్శి గోపే మురళిబాబు, ఆగిరిపల్లి ముసునూరు, నూజివీడు రూరల్ మండల అధ్యక్షులు చీకటి రాజు, సూర్యదేవర ప్రసాద్, వై. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయిలో ట్రాక్ మిషన్‌తో వరికోత

ట్రాక్టర్ గడ్డి రూ.పది వేలు!

(7వ పేజీ తరువాయి)

ఆరు నెలలు భూములు ఖాళీగా ఉండడంతో అప్పట్లో పశువులు తిరగడానికి ఇబ్బంది ఉండేది కాదు. బోరు బావులు వచ్చిన తర్వాత ఖరీఫ్, రబీ పంటల సాగుతో ఏడాది మొత్తం భూముల్లో పంటలు ఉంటున్నాయి.పశువులు తిరగడానికి చోటు కరువు అయ్యింది. పాడి మీద వచ్చే ఆదాయం కంటే పశువుల పోషణకు అధికంగా ఖర్చు అవుతోందని పశుపోషకులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామాల్లోను పశువులు కనుమరుగవుతాయని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భవనాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేయండి

నూజివీడు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు భవన యజమానుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్టు నూజివీడు మున్సిపల్ కమిషనర్ పీరయ్య తెలిపారు. జీవో నం. 225 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతులను జారీ చేసిందన్నారు. ఆగస్టు 31కి ముందు నిర్మించిన భవనాలకు సంబంధించిన యజమానులు ఈ నెల 12వ తేదీ నుంచి 120 రోజుల లోపు అర్జీలను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు

ముసునూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని నూజివీడు డీఎల్‌డీవో వెంకటరత్నం అన్నారు. శుక్రవారం ముసునూరు, గోపవరం, చింతలవల్లి తదితర గ్రామాల్లో చెత్త సేకరణను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సంపద కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐవీఆర్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్, డిజిటల్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

మద్యం అనుకుని గడ్డిమందు తాగి..

కైకలూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు భార్య కువైట్‌లో పనిచేస్తుంటే భర్త మద్యానికి బానిసైన వ్యక్తి అర్ధరాత్రి మద్యం అనుకుని గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కైకలూరు రూరల్ పోలీసులు తెలిపారు. ఈ నెల 11వ తేదీన అర్ధరాత్రి సమయంలో మండలంలోని దొడ్డిపట్ల గ్రామానికి చెందిన పోలుకొండ ఎలిషారావు(50) ఇంటి వద్ద వాంతులు చేసుకుంటు అతని కుమారుడు ఐజాక్ గమనించి ఏమైందని అడగడంతో ఇంటి వద్ద ఉన్న గడ్డి మందును మద్యం అనుకుని సేవించినట్లు తెలిపాడు. దీంతో ఎలిషారావును కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోవడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు ఎస్సై వి రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

కలిదిండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లులో గురువారం రాత్రి పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.65,200 స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

కోరుకొల్లుకు చెందిన నాగనబోయిన శ్రీనివాసరావు బైక్ చోరీపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 1న కలిదిండి ఆర్‌సీఎం చర్చి వద్ద తన బైక్‌ను ఉంచి తాపీ పనికి వెళ్లి తిరిగి వచ్చే సరికి బైక్ మాయమైంది. దీంతో కలిదిండి పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234